సూర్య 18 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

సంపుటి 18 | సంచిక 247

శనివారం | 28 జూన్ 2025 | హైదరాబాద్

| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం శుక్ల పక్షం తదియ మ. 12.22 వరకు, పుష్యమి ఉ.9.26 వరకు వర్జ్యం రా.10.19 నుంచి 11.56 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.5.28 నుంచి 7.12 వరకు

# టూరిజమే కీలకం

- గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఏపీ
- గేమ్ చేంజర్ కాబట్టే పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా
- పర్యాటక రంగంలోనే ఎక్కువ ఉద్యోగాలు
- పర్యాటక శాఖ సలహాదారుగా యోగా గురు బాబా రామ్ దేవ్
- జీఎఫ్ఎస్టీ టూరిజం క్యారవాన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- టూరిజం క్యారవాన్లను జెండా ఊపి ప్రారంభించిన ముఖ్యమంత్రి
- సీఎం సమక్షంలో రూ.10,329 కోట్ల విలువైన 82 ఒప్పందాలు కుదుర్చుకున్న ఏపీటీడీసీ



2 లో

గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గేమ్ ఛేంజర్ కాబట్టే పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఇచ్చామని స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్ లో జరిగిన గ్లోబల్ ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్టీ) టూరిజం కాన్‌క్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని ఇజంల కంటే టూరిజమే మిన్న అని దశాబ్దాల కిందటే తాను చెప్పిన మాట నిజమవుతోందని ముఖ్యమంత్రి అన్నారు. భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో
# అడ్మిషన్లు పెంచండి

- సంక్రాంతి దసరా సెలవులకు టూర్ ప్యాకేజీ
- విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ
- విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- సిఎస్ఆర్ నిధులతో విద్యార్థుల కోసం 600 డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ
- పాఠశాలలో లైబ్రరీ ప్రారంభోత్సవం
- మహాదేవపూర్ లో చిల్డ్రన్ పార్క్ ప్రారంభోత్సవం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



7 లో

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచండి సంక్రాంతి దసరా సెలవులకు టూర్ ప్యాకేజీ ఏర్పాటుచేసి హైదరాబాద్ ఢిల్లీ నగరాలకు తీసుకెళ్తామని రాష్ట్రంలో తమ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం కాటారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించి, సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ప్రాథమిక పాఠశాలలకు సిఎస్ఆర్ నిధుల ద్వారా విద్యార్థుల కోసం 600 డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ చేశారు.

## భారత్‌పై పాక్ మరో భారీ కుట్ర



6 లో

- ధ్వంసమైన ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణం..?
- పహల్గామ్ దాడి తర్వాత తీవ్రంగా నష్టపోయిన పాక్
- అయినా తన బుద్ధి మార్చుకోని శత్రుదేశం పాకిస్థాన్

## ఏఐ సాయంతో జీరో క్రైమ్ రేట్




2 లో

- శాంతి భద్రతలు ఉంటేనే పెట్టుబడులు, అభివృద్ధి
- వివేకా హంతకులను పట్టించింది టెక్నాలజీనే
- ఏఐ ఫర్ ఏపీ పోలీస్-హ్యాకథాన్-2025లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## తెలుగురాష్ట్రాల్లో వర్షాలు



2 లో

- చురుగ్గా నైరుతి రుతుపవనాలు
- బంగాళా ఖాతంలో అల్పపీడనం
- గంటకు 30-40 కి.మీ.వేగంతో ఈదురు గాలులు
- పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు
- వాతావరణ శాఖ ప్రకటన

## లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు



5 లో

- వరుసగా నాలుగో రోజు పరుగులు
- 84 వేల మార్కును దాటిన సెన్సెక్స్
- 303 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్
- 88 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

## పురపాలక ఎన్నికలు
# నిర్వహించరా?



- ఎందుకు నిర్వహించట్లేదో కారణం తెలపాలని ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- నోటీసులు, విచారణ వచ్చే నెల 11వ తేదీకి వాయిదా

వివరాలు-3లో

## ఎమ్.ఎస్.ఎమ్.ఇ.లకు
# కేంద్రం సంపూర్ణ సహకారం

- అంతర్జాతీయ ఎమ్.ఎస్.ఎమ్.ఇ. దినోత్సవ వేడుకల్లో వక్తలు
- ఫాప్సియా ఆధ్వర్యంలో విజయవాడలో ఘనంగా నిర్వహణ

2 లో

## మెరుగైన వసతులే
# ప్రామాణికం



7 లో

- ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం యోచన
- గత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక పరిశీలన
- పరిగణనలోకి సుప్రీంకోర్టు తీర్పులు
- ఆయా అంశాల అధ్యయనానికి కమిటీ నియామకం
- నిర్దేశిత సమయంలోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

## అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం
# కట్టుబడి ఉంది

- హుస్నాబాద్ కు 50 సీట్ల మెడికల్ పీజీ సెంటర్ మంజూరు
- 150 బెడ్ల ఆస్పత్రికి శంఖుస్థాపన
- 80 కోట్లతో ఫేస్ టు కింద నాలుగు వరసల రహదారి
- మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు



3 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## విద్యుత్ చార్జీలు
# పెంచేది లేదు



2 లో

- సాధారణ ఎన్నికల నాటికి విద్యుత్ ఛార్జీల తగ్గింపే లక్ష్యం
- ఉత్తమ సాంకేతికత, శిక్షణతో విద్యుత్ ప్రమాదాల తగ్గుదల
- దేశంలోనే నెంబర్ వన్ శిక్షణ కేంద్రంగా సూపర్ ఈసీబీసీ
- విశాఖ సూపర్ ఈసీబీసీ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి

## ఢిల్లీకి తక్షణమే అఖిలపక్షాన్ని
# తీసుకెళ్లాలి

- బీజేపీ కాంగ్రెస్ చిత్తశుద్ధి చూపించాలి
- బీజేపీ నిర్లక్ష్యం వహిస్తోంది
- బీసీలను బిఆర్ఎస్ మోసం చేసింది
- బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు



7 లో

నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బిల్లు ఆమోదింప చేయాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ చిరంజీవులు అన్నారు. లేని పక్షంలోబీసీలం పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రెస్ క్లబ్ లో పలు బీసీ సంఘాల నేతలతో కలిసి సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు బీసీల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, బిజెపిలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలో బిల్లు ఆమోదింప చేయాలని ఆయన కోరారు.

## రాష్ట్రంలో పరిపాలన ద్వారా
# మార్పులు తెస్తాం

- నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు
- మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు
- కాళేశ్వరం కేసులో సమగ్ర విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య



7 లో

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. మీడియాతో మాట్లాడుతూ ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తూ, గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్ను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. తలతిక్క పనులే బీఆర్ఎస్ను తిరస్కరించేలా చేశాయి అని జూపల్లి వ్యాఖ్యానించారు. ఇలాంటివి ఆదర్శ పాలనకు దూరమైన చర్యలు.



# తెలుగురాష్ట్రాల్లో వర్షాలు

- చురుగ్గా నైరుతి రుతుపవనాలు
- బంగాళాఖాతంలో అల్పపీడనం
- గంటకు 30-40 కి.మీ.వేగంతో ఈదురు గాలులు
- పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు
- వాతావరణ శాఖ ప్రకటన

అమరావతిః ఏపీలో రానున్న మూడు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల్లో అల్పపీడనం ఏర్పడటంతో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో మత్స్యకారులు సోమవారం వరకు వేటకు వెళ్లకూడదని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణలోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఈ ప్రభావంతో కొన్ని జిల్లాల్లో వానలు పడుతాయని వివరించింది. ఉరుములు, మెరుపులతో గంటకు 30- 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. నేడు తెలంగాణలోని 29 జిల్లాలకు వర్ష సూచన చేసింది వాతావరణ కేంద్రం.

# ఏ ఇజమూ కాదు టూరిజమే కీలకం

- గ్లోబల్ టూరిజం డెస్టినేషన్‌గా ఏపీ
- గేమ్ చేంజర్ కాబట్టే పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా
- పర్యాటక రంగంలోనే ఎక్కువ ఉద్యోగాలు
- పర్యాటక శాఖ సలహాదారుగా యోగా గురు బాబా రామ్ దేవ్
- జీఎఫ్ఎస్టీ టూరిజం కార్‌వాన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- టూరిజం క్యారవాన్లను జెండా ఊపి ప్రారంభించిన ముఖ్యమంత్రి
- సీఎం సమక్షంలో రూ.10,329 కోట్ల విలువైన 82 ఒప్పందాలు కుదుర్చుకున్న ఏపీటీడీసీ



అమరావతి, జూన్ 27: గ్లోబల్ టూరిజం డెస్టినేషన్గా ఆంధ్రప్రదేశ్ను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గేమ్ ఛేంజర్ కాబట్టే పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఇచ్చామని స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్ లో జరిగిన గ్లోబల్ ఫర్ సస్టెయినబుల్ ట్రాన్సఫర్మేషన్ (జీఎఫ్ఎస్టీ) టూరిజం కాన్క్లేవ్కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని ఇజంల కంటే టూరిజమే మిన్న అని దశాబ్దాల కిందటే తాను చెప్పిన మాట నిజమవుతోందని ముఖ్యమంత్రి అన్నారు. భవిష్యత్ అంతా పర్యాటక రంగానిదేనని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పర్యాటక రంగం ద్వారానే పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉందని స్పష్టం చేశారు. వెల్నెస్, హ్యాపీనెస్ ఫ్యూచర్ డెస్టినేషన్గా ఏపీని తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం పెట్టుబడులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ అనే నినాదంతో ముందుకెళ్తున్నాం. ఐటీ, ఉత్పత్తి పరిశ్రమలు, వ్యవసాయం కంటే ఎక్కువ మందికి పర్యాటక రంగం ఉద్యోగాలు కల్పిస్తుంది. పర్యాటక రంగం 20 శాతం వృద్ధి నమోదు చేస్తుంది. ఏపీలో భక్తుల్ని, పర్యాటకుల్ని ఆకట్టుకునేలా కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. శ్రీశైలంతో పాటు మరో 10 ప్రముఖ దేవాలయాలు పర్యాటక సర్క్యూట్లో ఉన్నాయి. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, అద్భుతమైన బీచ్లు, పురాతత్వ ఆనవాళ్లు కలిగిన ప్రదేశాలు, వెయ్యి కిలోమీటర్ల బీచ్ లైన్, కోనసీమ, హార్సిలీ హిల్స్ ఇలా వేర్వేరు అంశాలు ఏపీకి ఆకర్షణలు. ప్రస్తుతం అఖండ గోదావరి ప్రాజెక్టు చేపడుతున్నాం అని ముఖ్యమంత్రి అన్నారు.

**రియల్ టైమ్లో అనుమతులు-స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు**

పస్తుతం ఆంధ్రప్రదేశ్లో అత్యుత్తమ పర్యాటక విధానం అమలవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు కార్యాచరణ చేపట్టామని అన్నారు. అనుమతుల విషయంలో ఒక్క గంట కూడా వృథా కాకుండా అనుమతులు ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టులకు విద్యుత్ సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. పర్యాటక రంగంలో ఏపీ నెంబర్-1 కావాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. దేశానికి టూరిజం మోడల్గా ఏపీ మారాలి. అనుమతులు రియల్ టైమ్లోనే లభించేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నాం. ఏపీలో ఎలాంటి అవినీతి లేదు. పారదర్శకత, జవాబుదారీతనం ఉంది. ప్రస్తుతం ఏపీలో 3 వేల హోటల్ గదులు అందుబాటులో ఉన్నాయి. వచ్చే నాలుగేళ్లలో వీటిని 15 వేలకు పెరిగేలా చేస్తాం. ఈ రంగంలో ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇస్తాం. ఏపీలో 21 టెంపుల్ సర్క్యూట్లు, 2 బుద్ధిస్ట్ సర్క్యూట్లు, 25 థీమాటిక్ సర్క్యూట్లు ఉన్నాయి. బ్రిటీష్ వారు రవాణా కోసం తవ్వించిన బకింగ్ హామ్ కాలువ లాంటి వాటిని కూడా పర్యాటకానికి వినియోగిస్తాం. శ్రీశైలం నుంచి బెంగుళూరు. హైదరాబాద్, చెన్నైలకు కూడా హెలీ టూరిజం ప్రారంభిస్తాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడుల ద్వారా సంపద సృష్టిస్తేనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని ఆ తర్వాతే సంక్షేమం, అభివృద్ధి చేయగలమని ముఖ్యమంత్రి అన్నారు.



**ఐటీ లాగే పర్యాటకాన్ని ప్రమోట్ చేస్తున్నాం**

మూడు దశాబ్దాల క్రితం ఐటీని ప్రోత్సహించినట్టే ఇప్పుడు పర్యాటకాన్ని ప్రమోట్ చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ సమయంలో ఎవరూ హర్షించక పోయినా ఇప్పుడు ఆ ఫలాలను అందిపుచ్చుకుంటున్నారని సీఎం అన్నారు. పాతికేళ్ల క్రితం ప్రతి కుటుంబంలో ఒక ఐటీ ప్రొఫెషనల్ ఉండాలని పిలుపునిచ్చా. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఐటీ నిపుణులు మన తెలుగువాళ్లే ఉన్నారు. వన్ ఫ్యామిలీ ఒన్ ఎంటర్ ప్రెన్యూర్ అనే నినాదం ఇప్పుడు ఇస్తున్నాం. త్వరలోనే ఈ లక్ష్యం కూడా నెరవేరుతుంది. ఇప్పుడు అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. దీంతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత కూడా విస్తృతంగా అమలు చేయబోతున్నాం. వేర్వేరు మార్గాల ద్వారా వచ్చే డేటాను వీటితో విశ్లేషించి పాలనలో మంచి నిర్ణయాలు తీసుకోవచ్చు. ప్రభుత్వం అందించే 703 పౌరసేవల్లో ప్రస్తుతం 500కు పైగా సేవలు వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 15 తర్వాత అన్ని పౌర సేవలూ వాట్సాప్ ద్వారానే అందుతాయి. ఎవరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. అనుమతులూ వాట్సాప్ ద్వారానే అందుకోవచ్చు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు నైపుణ్యం కల్పించాలని నిర్ణయించాం. విశాఖ, అమరావతి, రాజమహేంద్రవరం, తిరుపతి, అనంతపురంలో ఆర్టీఐహెచ్ లు ఏర్పాటు చేస్తున్నాం. హైదరాబాద్ లో నా విజన్ ను విశ్వసించి పెట్టుబడులు పెట్టిన వారు సంపదను ఆర్జించారు. ఏపీలో మీ పెట్టుబడి సురక్షితం. ఇప్పుడే పెట్టుబడులు పెట్టండి. ఇప్పుడు కాకపోతే అవకాశం కోల్పోతారు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. జీరో పావర్టీ లక్ష్యంగా పీ4 విధానాన్ని అమలు చేస్తున్నామని .. సంపన్నులు, పేదల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేలా కార్యాచరణ చేపట్టినట్టు తెలిపారు.

**పర్యాటక సలహాదారుగా యోగా గురు బాబా రామ్దేవ్**

యోగాలో ప్రజల్ని ప్రభావితం చేసినట్టే ఏపీ పర్యాటకాన్ని కూడా బ్రాండింగ్ చేయాలని ప్రముఖ యోగా గురు బాబా రామ్ దేవ్ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. పర్యాటకం వెల్నెస్ కేంద్రాలకు బాబా రామ్దేవ్ సలహాదారుగా సేవలు అందించాలని అన్నారు. పతంజలి సంస్థను అగ్రస్థానానికి చేర్చినట్టే ఏపీ పర్యాటక రంగాన్ని మార్కెటింగ్ చేయాలని సూచించారు. బాబా రామ్ దేవ్ ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులు తేవటంలో కృషి చేయాలి. ప్రధాని మోదీ కోరిన మేరకు విశాఖలో 11వ అంతర్జాతీయ యోగా డే నిర్వహించి.. గిన్నీస్ రికార్డులు, ప్రపంచ రికార్డులు సాధించాం. అంతకుముందు నెల రోజుల పాటు రాష్ట్రంలో యోగా కార్యక్రమాలు చేపట్టాం. 3 లక్షల మందికి పైగా ఒకే చోట యోగా చేయించి రికార్డు సృష్టించాం. ఏపీలో వెల్నెస్ సెంటర్లు ఏర్పాటైతే, యోగా, ఆయుర్వేద, నేచురోపతి అందుబాటులో ఉంటుంది. మదనపల్లిలో ఏర్పాటు చేసే వెల్నెస్ సెంటర్ను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి, మౌలికసదుపాయాలు కల్పించి ఎక్కువ మంది పర్యాటకులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. ప్రస్తుతం ఏపీ ప్రకృతి వ్యవసాయంలో మొదటిస్థానంలో ఉంది. ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్ కోసం కూడా వెళ్తున్నాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**చంద్రబాబు దార్శనిక నేత : సీఎంను కొనియాడిన బాబా రామ్దేవ్**

దేశంలో చంద్రబాబు కంటే దార్శనికత కలిగిన నేత.. ప్రజాహితం కోరే నాయకుడు ఎవరూ లేరని ప్రముఖ యోగాగురు బాబా రామ్ దేవ్ వ్యాఖ్యానించారు. క్రియేటివిటీ, ప్రొడక్టివిటీ, ప్రొఫెషనలిజం, ఎఫీషియన్సీ లాంటి అంశాలకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్ అని కొనియాడారు. చంద్రబాబు తెలుగు ప్రజలకు దేవుడు పంపిన వరం అంటూ బాబా రామ్ దేవ్ ప్రశంసించారు. ప్రజల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన చేసినంత విజన్ మరెవరూ చేయటం లేదన్నారు. అందరికంటే వేగంగా, ముందుగానే ఆలోచిస్తూ చంద్రబాబు తన బయోలాజికల్ వయస్సును రివర్స్ చేశారని అన్నారు. పారిస్ , స్విట్జర్లాండ్, టర్కీ లాంటి దేశాలకు పర్యాటకం కోసం వెళ్తున్న ప్రజలు ఏపీలో ఉన్న పర్యాటక ప్రాంతాలను కూడా గుర్తించాలన్నారు. ఏపీ పర్యాటక రంగాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని రామ్ దేవ్ అన్నారు. పతంజలి సంస్థ హార్సిలీ హిల్స్లో ప్రపంచ ప్రమాణాలతో వెల్ నెస్ సెంటర్ను ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. అలాగే దిండి లాంటి ప్రాంతాల్లో వెడ్డింగ్ క్రూయిజ్ బోట్ లాంటి ప్రాజెక్టు చేపట్టేందుకు ఆసక్తి కనపరుస్తోందన్నారు. భారతీయ సంప్రదాయ వివాహాలు అక్కడ జరిపించేలా డెస్టినేషన్ వెడ్డింగ్ ప్రాజెక్టు చేపడతామని అన్నారు. ప్రభుత్వం అనుమతిస్తే ఏపీ పర్యాటకానికి తాను ప్రచారం చేస్తానని వెల్లడించారు. కార్యక్రమం అనంతరం హరిద్వార్ నుంచి తెచ్చిన పవిత్ర గంగా జలాన్ని సీఎం చంద్రబాబుకు బాబారామ్ దేవ్ అందజేశారు. జీఎఫ్ఎస్టీ టూరిజం కాన్క్లేవ్లో భాగంగా వివిధ పర్యాటక ప్రాజెక్టుల ఒప్పందాలు సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగాయి. 82 ప్రాజెక్టులకు సంబంధించి రూ.10,329 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థతో ఆయా సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. అనంతరం టూరిజం బ్రోచర్, కాఫీ టేబుల్ బుక్, పర్యాటక ఈవెంట్ల కేలండర్ను బాబా రామ్ దేవ్తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. అంతకుముందు హోటల్ గదులుగా తీర్చిదిద్దిన టూరిజం క్యారవాన్లను సీఎం జెండా ఊపి ప్రారంభించారు.

# ఏఐ సాయంతో జీరో క్రైమ్ రేట్

- శాంతి భద్రతలు ఉంటేనే పెట్టుబడులు, అభివృద్ధి
- వివేకా హంతకులను పట్టించింది టెక్నాలజీనే
- ఏఐ ఫర్ ఏపీ పోలీస్-హ్యాకథాన్-2025లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



గుంటూరు, జూన్ 27: టెక్నాలజీ సాయంతో ఆంధ్రప్రదేశ్ ని నేర రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలీసులకు పిలుపునిచ్చారు. టెక్నాలజీతో దర్యాప్తు ఎలా చేయాలో వివేకా హత్య కేసే ఉదాహరణ అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఏఐ ఫర్ ఏపీ పోలీస్-హ్యాకథాన్-2025 కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నేరాల కట్టడికి.. వేగవంతమైన దర్యాప్తునకు పోలీస్ విభాగం టెక్నాలజీని వినియోగించుకునే అంశంపై హ్యాకథాన్ నిర్వహించింది. ఏపీ పోలీస్ విభాగం, అమెరికాకు చెందిన 4 సైట్ ఏఐ సంస్థలు ఈ హ్యాకథాన్ నిర్వహించాయి. ఈ హ్యాకథానులో 160కు పైగా టీములు పాల్గొన్నాయి. ఈ టీములతో సీఎం చంద్రబాబు నాయుడు కొద్ది సేవు ముచ్చటించారు. పోలీస్ విభాగంలో టెక్నాలజీని వినియోగించడం ద్వారా ఎలాంటి సేవలు అందించవచ్చు.. పనితీరును ఏ విధంగా మెరుగుపరుచుకోవచ్చనే అంశంపై వారితో ముఖ్యమంత్రి చర్చించారు.

వివేకా హత్య కేసు... గూగుల్ టేకౌవుట్

హ్యాకథాన్ కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది. శాంతి భద్రతలు కంట్రోల్లో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. అందుకే ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు కూడా శాంతి భద్రతలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చానని స్పష్టం చేశారు. దీనికి పోలీస్ శాఖ సమర్ధవంతంగా పని చేయాలి. గతంలో మాదిరి కాకుండా పోలీసుల పనితీరు మారాలి. సహజంగా పోలీసులు పాత పద్దతులను అవలంభిస్తారు. కానీ ఏపీ పోలీసులు టెక్నాలజీ అవసరాన్ని గుర్తించి ఈ రకమైన హ్యాకథాన్ ఏర్పాటు చేయడం సంతోషం. పోలీసులు తమ దర్యాప్తులో టెక్నాలజీని విరివిగా వినియోగించాలి. వివేకా హత్య కేసులో నాపై ఆరోపణలు చేశారు. నారాసుర రక్త చరిత్ర అంటూ విమర్శించారు. కానీ సీబీఐ తన దర్యాప్తులో గూగుల్ టేకవుట్ వంటి సాంకేతిక విధానాలను వినియోగించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికీ వాళ్లు మారలేదు. మాజీ సీఎం అయ్యుండి తెనాలిలో రౌడీ షీటర్లకు సంఘీభావం తెలిపారు. ఇటీవల పల్నాడు జిల్లాలో పర్యటనలో ఏం జరిగిందో అందరూ చూశారు. తప్పులు చేసి బుకాయిస్తున్నారు. ఇలాంటి బుకాయింపులను తిప్పికొట్టాలంటే టెక్నాలజీని ఉపయోగించక తప్పదు. అని సీఎం స్పష్టం చేశారు.

ప్రభుత్వమే, పోలీసులే కాదు... యువత కూడా టెక్నాలజీ బాట పట్టాలి

ప్రభుత్వంలో టెక్నాలజీని వినియోగిస్తున్నామని.. పోలీస్ విభాగం కూడా సాంకేతిక అందిపుచ్చుకుంటోందని.. దానికి ఈ హ్యాక్ థాన్ నిర్వహణే నిదర్శనమన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టెక్నాలజీ ద్వారా సేవలు అందించడమే కాదు.. పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది. డ్రోన్లను.. సీసీ టీవీ కెమెరాలు అన్ని చోట్లా పెడుతున్నాం. రౌడీలు గొడవ చేస్తే.. ఆధారాలతో వారి చొక్కా పట్టుకునే పరిస్థితి తెస్తాం. ఇష్టానుసారంగా గంజాయి అమ్ముతాం, సేవిస్తాం, పండిస్తాం అంటే కుదరదు.. తాటతీస్తాం. ఆడబిడ్డలను గొడవ చేస్తాం.. అత్యాచారాలను చేస్తాం అంటే కుదరదు.. ఏఐ లేనప్పుడు కంట్రోల్ చేశాం. ఇప్పుడు టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది.. ఆధారాలు చాలా సులువుగా లభిస్తాయి. తప్పు చేస్తే.. ప్రభుత్వం ఏం చేయాలో అది చేసి చూపిస్తాం. యువత టెక్నాలజీతో లబ్ది పొందాలి. గతంలో ఐటీని ప్రమోట్ చేశాం. ఇప్పుడు క్వాంటం వ్యాలీ ద్వారా తెలుగు సత్తాను చాటబోతున్నాం. అమెరికాలో సిలికాన్ వ్యాలీ.. ఇక్కడ క్వాంటం వ్యాలీ. వర్క్ లోకల్లీ.. థింక్ గ్లోబల్లీ.. యాక్ట్ గ్లోబల్లీ అనే విధంగా ప్రస్తుతం ప్రపంచం రూపాంతరం చెందుతోంది. అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.



# విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదు

- సాధారణ ఎన్నికల నాటికి విద్యుత్ ఛార్జీల తగ్గింపే లక్ష్యం
- ఉత్తమ సాంకేతికత, శిక్షణతో విద్యుత్ ప్రమాదాల తగ్గుదల
- దేశంలోనే నెంబర్ వన్ శిక్షణా కేంద్రంగా సూపర్ ఈసీబీసీ
- రాష్ట్ర వ్యాప్తంగా 13 నెలల్లో 180 కారుణ్య నియామకాలు
- విశాఖలో ఒక్క రోజే 20 మందికి నియామక పత్రాలు అందజేత
- విశాఖ సూపర్ ఈసీబీసీ శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి



విశాఖపట్నం , 27 జూన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో రూ.14 కోట్ల వ్యయంతో నిర్మించిన సూపర్ ఈసీబీసీ భవనాన్ని శుక్రవారం నాడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమ అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... విద్యుత్ ఉద్యోగుల శిక్షణ కోసం ప్రత్యేకంగా నిర్మించిన సూపర్ ఈసీబీసీ భవనం దేశంలోనే అత్యుత్తమ శిక్షణ కేంద్రంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈసీబీసీ నిబంధనలకు అనుగుణంగా నిర్మించిన ఈ భవనం ద్వారా సుమారు 40 శాతంపైగా విద్యుత్ ఆదా అవుతుండటం ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్యుత్ శాఖలో వివిధ ప్రమాదాలతో విధుల్లో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈపీడీసీఎల్ పరిధిలోని సుమారు 20 మందికి సంస్థలో ఉద్యోగం కల్పిస్తు ఉత్తర్వులు అందజేశారు. విద్యుత్ శాఖలో ఉద్యోగులు చనిపోతే వారి కుటుంబాలు ఏళ్ల తరబడి ఉద్యోగం కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా వీలైనంత తక్కువ రోజుల్లోనే నియామక పత్రాలు అందజేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 13 నెలల్లో సుమారు 180 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదొక ఉదాహరణ అని చెప్పారు. విద్యుత్ శాఖలో విధినిర్వహణలో లైన్ మెన్ లు వంటి కింద స్థాయి సిబ్బంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరమని మంత్రి గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో మరణించిన వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాలు దాటిన తరువాత కూడా ఇంత వరకు విద్యుత్ సౌకర్యం లేని... తండాలు, చెంచు గూడేలకు రూ.120 కోట్లు వ్యయంతో... విద్యుత్ అందించినట్లు వివరించారు. అదే విధంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు వేయలేని టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లోని నివాసితులకు కూడా సోలర్ ప్యానెల్స్, బ్యాటరీ స్టోరేజ్ పద్ధతులలో నిరంతర విద్యుత్ ను అందిస్తున్నామని, ఇది కూటమి ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అనేక చర్యలు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. 24 గంటలూ నాణ్యమైన గ్రీన్ ఎనర్జీని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందించే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 20 లక్షల సోలార్ విద్యుత్ కనెక్షన్లను ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం 10 వేల సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సోలార్ కనెక్షన్లను వేగవంతం చేసే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేందుకు స్థానిక సోలార్ తయారీదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అదే విధంగా పీఎం కుసుమ్ పథకంలో భాగంగా... వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి... రైతులకు పగటి పూటే 9 గంటల నాణ్యమైన విద్యుత్ ను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీనితో పాటు రాష్ట్రంలోని మూడు లక్షల వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ కనెక్షన్లను అనుసంధానించే ప్రక్రియ వేగవంతం చేసినట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు.

ఈ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ మాట్లాడుతూ, ఈ సూపర్ ఈసిబీసి భవనం ఇంధన సామర్థ్య నిర్మాణానికి ప్రతీకగా నిలిచే విధంగా ఉండటమే కాకుండా, ఈసిబీసి ప్రమాణాలను ప్రజలలో, సమాజంలో చైతన్యం కలిగించే ప్రత్యక్ష నమూనాగా పనిచేస్తుందని చెప్పారు. లైన్మెన్ నుండి చీఫ్ ఇంజినీర్ల వరకు శిక్షణ ఇచ్చే విధంగా నిర్మించబడిన ఈ కేంద్రంలో స్కాడా , ఆర్ఎంయూ , ట్రాన్స్ఫార్మర్, మీటర్ టెస్టింగ్ ల్యాబ్లతో పాటు కొత్తగా నియమించబడిన ఉద్యోగులకు ఇండక్షన్ శిక్షణ కూడా ఇస్తారని తెలిపారు. ఈ కేంద్రాన్ని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిపేలా, ప్రభావవంతంగా ఉపయోగపడేలా ఒక గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఆయన తెలిపారు. విద్యుత్ మంత్రి, ముఖ్యమంత్రి మార్గదర్శకాల్లో, రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించేందుకు కట్టుబడి ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ 13,000 మెగావాట్లకు చేరినప్పటికీ, రోజుకు 254 మిలియన్ యూనిట్ల సరఫరా చేసి డిమాండ్ను విజయవంతంగా తీర్చామన్నారు. కుసుం పథకం కింద 3 లక్షల వ్యవసాయ సౌర పంపుల కనెక్షన్లను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, 20 లక్షల ఎస్సీ/ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సౌర రూఫ్టాప్ ఏర్పాటుచేస్తామని , బీసీలకు అదనంగా రూ. 20,000 సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 10,000 సౌర రూఫ్టాప్ కనెక్షన్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఏపీఈపీడీసిఎల్ పరిధిలోని విశాఖపట్నం జిల్లాలో విద్యుత్ పిల్ఫరేజ్ అత్యల్పంగా ఉందని తెలిపారు. నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నాణ్యమైన విద్యుత్ అవసరమని చెప్పారు.ఎంపీ ఎం. భరత్ రూఫ్ టాప్ సోలార్ అమలును వేగవంతం చేయాలని కోరుతూ, సూపర్ ఈసిబీసి భవనాన్ని విజయవంతంగా నిర్మించిన ఈపీడీసిఎల్ను అభినందించారు.ఎంఎల్సీ వీ. చిరంజీవిరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రారంభమైన విద్యుత్ రంగ సంస్కరణలను గుర్తు చేస్తూ, జన్ మన్ పథకం అమలు, విద్యుత్ పంపిణీ నష్టాలను తగ్గించడం లో ఏపీఈపీడీసిఎల్ చేసిన కృషిని ప్రశంసించారు.ఏపీఈపీడీసిఎల్ సిఎండీ ఐ. పృథ్వీ తేజ్ మాట్లాడుతూ, సంస్థ ఏటీసి నష్టాలను 10.1% నుండి 7.5%కి, పంపిణీ నష్టాలను 6.5% నుండి 5.8%కి తగ్గించగలిగిందని తెలిపారు. 5.54 లక్షల ఫిర్యాదుల్లో 97% ఫిర్యాదులను పరిష్కరించామని, సంస్థ వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద 220 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల టెండరింగ్ తుది దశలో ఉందని తెలిపారు. విశాఖపట్నంలో పీ ఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటికే 2,000 సౌర రూఫ్టాప్ వ్యవస్థలు అమలైనట్లు తెలిపారు. ఆర్డీఎస్ఎస్ కింద ఫీడర్ సెగ్రిగేషన్, అండర్గ్రౌండ్ కేబ్లింగ్ పనులు జరుగుతున్నాయని, ఖరారైన 34 సబ్ స్టేషన్లలో 18 సబ్ స్టేషన్లు ఇప్పటికే ప్రారంభించినట్లు చెప్పారు. జన్ మన్ పథకం కింద గిరిజన తండాలులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు కల్పిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ విజయానంద్, సీఎండీ పృథ్వీతేజ ఇమ్మడి పెద వాల్తేరు లో ఏర్పాటు చేసిన స్కాడా భవనాన్ని, విశాఖ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్స్టేషన్ను సందర్శించి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్, ఏపీఈపీడీసిఎల్ డైరెక్టర్లు, సీనియర్ అధికారులు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్.ఎస్.ఎమ్.ఇ.లకు

# కేంద్రం సంపూర్ణ సహకారం

- అంతర్జాతీయ ఎమ్.ఎస్.ఎమ్.ఇ. దినోత్సవ వేడుకల్లో వక్తలు
- ఫాప్సియా ఆధ్వర్యంలో విజయవాడలో ఘనంగా నిర్వహణ



విజయవాడ:- దేశానికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారానే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎమ్.ఎస్.ఎమ్.ఇ. దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అసోసియేషన్ల ఫెడరేషన్ (ఫాప్సియా) ఆధ్వర్యంలో దినోత్సవ వేడుకలు శుక్రవారం విజయవాడలోని ఓ హోటల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేడుకలకు హాజరైన ప్రతినిధులకు ఫాప్సియా కార్యదర్శి ఇ.ఫణి పూర్ణచంద్రరావు స్వాగతం పలికారు. సమావేశానికి ఫాప్సియా అధ్యక్షుడు వి.మురళీకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ, భారతదేశంలో అంతర్జాతీయ ఎమ్ఎస్ఎమ్ఇ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం విధానంలో భాగంగా ఎమ్ఎస్ఎంఇలు మరియు ఫైనాన్సింగ్, టెక్నాలజీ, ఎగుమతి మార్కెట్లు మరియు విధాన మద్దతు మధ్య సంబంధాలను నిర్మించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెడుతుందన్నారు. ఇది అంతర్జాతీయ వ్యాపార మార్గాలను ఉత్ప్రేరకపరచడం మరియు నెట్ వర్కింగ్ అవార్డులు మరియు ఎగుమతి సామర్థ్య నిర్మాణం ద్వారా ఎమ్ఎస్ఎమ్ఇ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఏపీలోని ఎమ్.ఎస్.ఎమ్.ఇలకు ఫాప్సియా అన్ని విధాలుగా ఎప్పుడూ సహకారం అందిస్తుందని ఫాప్సియా కార్యదర్శి ఫణి పూర్ణచంద్రరావు తెలిపారు. ఇండస్ట్రీస్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ రామలింగరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం నుండి అందిస్తున్న వివిధ పథకాలు, ప్రోత్సాహకాలు గురించి వివరించారు. ఎమ్ఎస్ఎమ్ఇలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అనేక పథకాలు తీసుకొచ్చాయని చెప్పారు. ఎమ్ఎస్ఎమ్ఇల సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఉన్న కమిటీల్లో ఎమ్ఎస్ఎమ్ఇ అసోసియేషన్లను కూడా సభ్యులుగా చేర్చి, వారి సలహాలు కూడా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ, ఎమ్ఎస్ఎమ్ఇలకు బ్యాంకుల నుండి ఋణాలివ్వడానికి ప్రాధాన్యతగా తీసుకుని, తక్కువ సమయంలో ఋణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఓడో ఇంప్లిమెంటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఇ.ఆర్.పి. సొల్యూషన్స్, అకౌంటింగ్ సాఫ్ట్ వేర్ ఎమ్ఎస్ ఎమ్ఇలకు వారి కంపెనీ అందిస్తున్న సాఫ్ట్వేర్ గురించి సభలో సమగ్రంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఫాప్సియా ఉపాధ్యక్షుడు వై.సాంబశివరావు, జి.శ్రీనివాస యాదవ్, కోశాధికారి జి.వి.రెడ్డి, ఫాప్సియా మీడియా కో ఆర్డినేటర్ నిడదవోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జల విద్యుత్కేంద్రం పనులు వేగవంతం చేయండి

- పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయ్యేనాటికి విద్యుత్కేంద్రం సిద్ధం కావాలి
- ఏ పీ జెన్కో డైరెక్టర్ సుజయ్ కుమార్
- పూజలు నిర్వహించి 150 టన్నుల సామర్థ్యం ఉన్న క్రేన్ ప్రారంభించిన డైరెక్టర్
- పాల్గొన్న జెన్కో, ఎం ఏ ఐ ఎల్ అధికారులు

పోలవరం/అంగలూరు , జూన్ 27: పోలవరం ప్రాజెక్ట్ పూర్తి అయ్యే సమయానికి జల విద్యుత్ కేంద్రాన్ని కూడా సిద్ధం చేయాలని ఏ పీ జెన్కో డైరెక్టర్ (హైడల్ ) ఎం సుజయ్ కుమార్ అన్నారు. నిర్దేశిత సమయానికి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జెన్కో అధికారులు కాంట్రాక్టు సంస్థకు సూచించారు. పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్, ఈ సి ఆర్ ఎఫ్ పనులకు సమాంతరంగా విద్యుత్ కేంద్రం పనులు చేపట్టాలన్నారు. ఈ దిశగా పనులు వేగవంతం చేయాలన్నారు. శుక్రవారం పోలవరం జల విద్యుత్ కేంద్రంలో కీలకమైన 150/30 టన్నుల సామర్థ్యం కలిగిన క్రేన్ పనితీరును పరీక్షించి పూజలు చేసి సుజయ్ కుమార్ ప్రారంభించారు. క్రేన్ పని తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. జల విద్యుత్ కేంద్రంలో టర్బైన్లు, జనరేటర్ వంటి కీలకమైన పరికరాలను బిగించేందుకు ఈ క్రేన్ ను ఉపయోగిస్తారు. ఈ క్రేన్లను ఎలెక్ట్రికల్లీ ఓవర్ హెడ్ ట్రావెలర్ క్రేన్స్ అని కూడా అంటారు. జల విద్యుత్ కేంద్రంలో త్వరలో 225/40 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు క్రేన్లను ఏర్పాటు చేస్తామని ఎం ఈ ఐ ఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర తెలిపారు. టర్బైన్లు, జెనరేటర్ల ను బిగించే పనిని త్వరలో ప్రారంభిస్తామని, ఇప్పటికే ఎనిమిది జెనెరేటర్లు ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతానికి చేరుకున్నాయని జెన్కో డైరెక్టర్ సుజయ్ కుమార్ కు సతీష్ బాబు వివరించారు. క్రేన్ పూజ, ప్రారంభ కార్యక్రమంలో జెన్కో హెచ్ పీ సి సి ఈ నాగరాజు, సి ఈ సివిల్ రవీంద్రరెడ్డి, ఎస్ ఈ సివిల్ రామచంద్రరాజు, అరుణ్ కుమార్ , ఎస్ ఈ (ఈ అండ్ ఎం) కే చంద్రశేఖర రావు, జల విద్యుత్ కేంద్రం ఎం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ ప్రసేన్జిత్ మజుందార్, డి జీ ఎం బాలగంగాధర్, ఏ జీ ఎం చిష్టి , సీనియర్ మేనేజర్ మణికంఠ, ప్రణాళిక విభాగం ఇన్చార్జ్ సి హెచ్ కిశోర్ బాబు పాల్గొన్నారు.





## డైలీ సీరియల్‌లా కొనసాగుతున్న ఫోన్ టాపింగ్ విచారణ : ఎంపీ రఘునందన్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు సంబంధించి ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫిర్యాదు చేసిన తమను సిట్ ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. దుబ్బాక ఉప ఎన్నికలతోనే ఫోన్ ట్యాపింగ్ ప్రారంభమైందని.. మొట్ట మొదటిసారిగా తన ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని డీజీపీకి అనేక సార్లు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్తో సంబంధంలేని కాంగ్రెస్ నాయకులను సిట్ పిలుస్తోందని.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ అయ్యింది తనదన్నారు. మమ్మల్ని అడిగితే అన్ని వివరాలు ఇచ్చే వాళ్ళమన్నారు. ఫోన్ ట్యాపింగ్లో గాడిద గుడ్డు తప్ప చర్యలు ఉండవని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మూలాఖత్ అయ్యాయని విమర్శించారు. ఫిర్యాదు చేసిన తమను సిట్ ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. రోజుకు ఒక్కరిని మాత్రమే విచారణ చేయడానికి ఇదేమైనా డైలీ సీరియలా అని ప్రశ్నించారు. ఆధారాలు ఇచ్చే వాళ్లను పక్కన పెట్టి డైలీ సీరియల్ నడువుతున్నారని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రచార ఆర్భాటాలు తప్ప మరొక్కటి లేదని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. బెదిరింపు కాల్స్ విచారణ జరుగుతుందని పోలీస్ ఉన్నతాధికారులు చెప్పారని తెలిపారు. నియోజకవర్గానికి వెళ్లినప్పుడు సమాచారం ఇస్తే ఎస్కార్ట్, ముగ్గురు సిబ్బందిని ఇస్తామన్నారన్నారు. కాంగ్రెస్ 18 మాసాల పాలనపై సమీక్షించుకోకుండా రోజుకొక కొత్త కథతో ముందుకు వస్తోందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ మేయర్ ఐదు రూపాయల భోజనం పేరు మారుస్తున్నట్లు ప్రకటించారని.. అన్నపూర్ణ క్యాంటీన్ పేర్లను ఇందిరమ్మ పేరు పెట్టడం దౌర్భాగ్యమన్నారు. ఇందిరమ్మ పేరు చెబితే ఎమర్జెన్సీ గుర్తుకు వస్తుందనే ఇంగిత జ్ఞానం లేకుండా ఇందిరమ్మ పేరు పెడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. మేయర్ దృష్టి పెట్టాల్సింది కుక్కల బెడద, సమస్యలపైన కానీ పేర్ల మార్పు మీద కాదు అంటూ హితవుపలికారు. పథకాల పేర్లు మార్చడాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు తప్పితే ఇళ్ళు లేని వాళ్లకు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీలకు సవాల్ విసురుతున్న.. ఇళ్లులేని వాళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని నిరూపించాలన్నారు. కవిత బీసీనా. అధికారంలో ఉన్న పదేళ్లు ఎందుకు బీసీలు గుర్తుకురాలేదు. బీసీలకు అధ్యక్ష పదవి, ఎల్పీనేత పదవులు ఇవ్వకుండా బీసీ ఉద్యమం చేస్తామంటే ఎట్లా? మతపరమైన రిజర్వేషన్లు తొలగిస్తే.. రాజ్యాంగ సవరణ చేస్తాం అని ఎంపీ రఘునందన్ రావు వెల్లడించారు.

# అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

- హుస్నాబాద్ కు 50 సీట్ల మెడికల్ పీజీ సెంటర్ మంజూరు
- 150 బెడ్ల ఆస్పత్రికి శంఖుస్థాపన
- 80 కోట్లతో ఫేస్ టు కింద నాలుగు వరసల రహదారి
- మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: హుస్నాబాద్ కు 50 సీట్ల మెడికల్ పీజీ సెంటర్ మంజూరు చేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ. కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. హుస్నాబాద్ నియోజకవర్గ పర్యటనలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ గ కలిసి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ 150 బెడ్ల ఆస్పత్రి కీ శంకుస్థాపన చేశారు, 100 పడకల సామర్థ్యంతో నిర్మించిన మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా 77 కోట్లతో హుస్నాబాద్ నుండి సుందరగిరి వరకు, సుందరగిరి నుండి కొత్తపల్లి వరకు 80 కోట్లతో ఫేస్ టు కింద నాలుగు వరసల రహదారి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ గొంతు తెలంగాణ హక్కును పార్లమెంట్ లో యావత్ దేశానికి వినిపించిన వ్యక్తి పొన్నం ప్రభాకర్. గత 16 నెలల్లో హుస్నాబాద్ అభివృఎద్ధి ను చూస్తే పొన్నం ప్రభాకర్ ఏ ఒక్క శాఖ ను వదలరు.. నా హుస్నాబాద్ అని అభివృఎద్ధి నీ ఇక్కడికి తీసుకొస్తారు. హుస్నాబాద్ ఓ తాలూకా హెడ్ క్వార్టర్.. 50 పడకల ఆసుపత్రి మాత్రమే..కానీ ఇప్పుడు 250 పడకల ఆసుపత్రి మీ హుస్నాబాద్ కి వచ్చింది నా ప్రజల ఆరోగ్యం నా బాధ్యత నా ప్రభుత్వం బాధ్యత అని ఇక్కడికి హాస్పిటల్ తెచ్చారు. సమాజంలో మార్పు రావాలంటే విద్యా, వైద్యం,నైపుణ్యం ఉండాలన్నారు. శాతవాహన యూనివర్సిటీ 2009 లో వస్తే 19 సంవత్సరాల తరువాత ఇప్పుడు హుస్నాబాద్ కి శాతవాహన యూనివర్సిటీ నుండి ఇంజినీరింగ్ కాలేజీ వచ్చింది.. పొన్నం ప్రభాకర్ వల్లే అని స్పష్టం చేశారు. హుస్నాబాద్ 250 పడకల ఆసుపత్రికి 50 సీట్లతో పీజీ మెడికల్ కాలేజీ నీ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక నర్సింగ్ కాలేజీ అవసరమన్నారు. నర్సింగ్ చదివే మన పిల్లలు విదేశాల్లో కూడా జాబ్ చేస్తూ సేవలు అందించాలనీ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో మన ఆడ బిడ్డలు నర్స్ లు ,డాక్టర్ లు ఉండాలని కోరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 8 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీ లు ఏర్పాటు చేశాం.. వచ్చే కొద్ది రోజుల్లో మరిన్ని నర్సింగ్ కాలేజీ లు వస్తాయిన్నారు. ఒకప్పుడు హుస్నాబాద్ నక్సల్ ప్రాంతం ,కమ్యూనిస్ట్ ప్రాంతం కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రాంతం. ప్రజాస్వామ్యం లో మన ఉనికి కాపాడుకోవాలి కులాంతరాన్ని పాతరేయాలి. నాయకుడు ప్రజాస్వామ్య సేవకు బతకాలి అలాంటి నాయకుడు మీ నాయకుడు.. హుస్నాబాద్ అంటే నా ఇల్లు.. నా బిడ్డలు అంటారు. మాట ఇస్తే మాట నిలబెట్టుకునే సత్తా ఉండాలి.. సమాజంలో మార్పు రావాలి. అందరూ విద్యావంతులు కావాలి.. వ్యవస్థ మార్పులు రావాలి. మీ ఆశీర్వాదం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉండాలి. రాబోయే కాలంలో సమాజంలో సంపూర్ణ మార్పు రావాలి అంటే మహిళా సాధికారత రావాలి. సమాజంలో మార్పు రావాలి అంటే మహిళల్లో మార్పు రావాలి.. విద్యాధికులు రావాలి మహిళా సాధికారత రావాలి. గత 50 సంవత్సరాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్ల సంఖ్య పెరగలేదు..కానీ ఇప్పుడు అదనంగా మాత శిశు హాస్పిటల్ లో కలిసి 250 పడకలు వచ్చాయన్నారు.



## పురపాలక ఎన్నికలు నిర్వహించరా?

- ఎందుకు నిర్వహించట్లేదో కారణం తెలపాలని ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- నోటీసులు - విచారణ వచ్చే నెల 11వ తేదీకి వాయిదా




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: పురపాలక ఎన్నికలపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిర్మల్కు చెందిన ఎస్.రాజేందర్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. నిర్మల్ పురపాలక ఎన్నికలు సకాలంలో నిర్వహించడం లేదని, మార్చి 25వ తేదీనే పురపాలక గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించలేదని పిటిషనర్ పేర్కొన్నారు.

**విచారణ వచ్చే నెల 11వ తేదీకి వాయిదా**

పిటిషన్ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. సకాలంలో ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదో కారణం తెలపాలన్న హైకోర్టు, విచారణను వచ్చే నెల 11వ తేదీకి వాయిదా వేసింది. 3 నెలల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి : తెలంగాణ హైకోర్టులో స్థానిక సంస్థల ఎన్నికలపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన తుది తీర్పును ఈ నెల 25న న్యాయస్థానం వెలువరించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలను 3 నెలల్లో నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీలైనంత త్వరగా 30 రోజుల్లో వార్డుల విభజన పూర్తిచేసి, ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచించిన విషయం తెలిసిందే.

# మునుగోడు ఎన్నికలప్పుడు నా ఫోన్ ట్యాపింగ్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: మునుగోడు, దుబ్బాక ఎన్నికల సందర్భంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి తెలిపారు. చట్టవిరుద్ధంగా తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకు వ్యతిరేకత వచ్చిందని.. దాంతో అభద్రత భావంతో తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని కొండా విశ్వేశ్వర్రెడ్డి వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి శుక్రవారం జూబ్లీహిల్స్ పోలీస్స్టేషన్లో సిట్ అధికారులకు తన వాంగ్మూలం ఇచ్చారు. ఈ క్రమంలో కొండా విశ్వేశ్వర్రెడ్డి స్టేట్మెంట్ని సిట్ అధికారులు రికార్డ్ చేశారు. 2023 నవంబర్లో కొండా విశ్వేశ్వర్రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి మాట్లాడారు. మునుగోడు, దుబ్బాక, హుజురాబాద్ ఎన్నికల సందర్భంలో తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లుగా సిట్ అధికారులు చూపించారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులకు స్టేట్మెంట్ ఇచ్చానని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పేర్కొన్నారు ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి. మునుగోడు, దుబ్బాక ఎన్నికల సందర్భంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి గుర్తుచేశారు. చట్టవిరుద్ధంగా తన ఫోన్ ట్యాపింగ్ చేశారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకు వ్యతిరేకత వచ్చిందని.. దాంతో అభద్రత భావంతో తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని అన్నారు. తన ఆఫీస్లో వారెంట్ లేకుండా వచ్చి కొందరు పోలీస్ అధికారులు దౌర్జన్యం చేసి.. ఫోన్ ట్యాపింగ్ చేశారని వెల్లడించారు. గత డీజీపీ మహేందర్రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో తనతో పాటు తన అనుచరుల మూవ్మెంట్ని కూడా పసిగట్టారని చెప్పారు. తన స్నేహితుడు బంగారం కొన్న రూ.72 కోట్లను పోలీసులు పట్టుకున్నారని.. అవి తన డబ్బులు అన్నట్లుగా ఫోన్ ట్యాపింగ్ చేసి బెదిరించారని తెలిపారు కొండా విశ్వేశ్వర్రెడ్డి. తన భూమి అమ్మితే కొన్న వ్యక్తి పైసలు ఇచ్చారని అతన్ని కూడా హింసించి రూ.13 కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ రాయించారని కొండా విశ్వేశ్వర్రెడ్డి గుర్తుచేశారు. ఈటల రాజేందర్కి డబ్బులు ఇచ్చినట్లుగా కేసీఆర్ ప్రభుత్వంలో తనపై నిందలు మోపారని విమర్శించారు. తాను ఈటలకు ఎన్నికల సమయంలో సపోర్ట్ చేశానని.. కానీ డబ్బులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తన మొబైల్ రికార్డింగ్ ట్యాపింగ్ కాకపోవడంతో లైవ్ ట్యాపింగ్ చేశారని చెప్పుకొచ్చారు. తనతో పాటు తన భార్య సంగీత ఫోన్ని సైతం ట్యాపింగ్ చేశారని మండిపడ్డారు. మునుగోడు ఎన్నికల సమయంలో తాము ఇన్చార్జ్గా ఉన్నపుడు తమ ఫోన్లు ట్యాపింగ్ చేశారని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్కు హోం సెక్రటరీ అనుమతి ఉండాలి కానీ ఇక్కడ అవేమి లేకుండా ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. తన కాల్స్ని చట్టవిరుద్ధంగా రికార్డ్ చేశారని చెప్పారు. తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తే తిరిగి తనపైనే నాన్ బెయిలబుల్ కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభాకర్రావుతో పాటు ఈ ట్యాపింగ్లో ఇన్వాల్ అయిన వారిని కఠినంగా శిక్షించాలని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై పార్లమెంట్లో మాట్లాడుతామని ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి పేర్కొన్నారు.



## కంచ గచ్చిబౌలిపై చర్యలు తీసుకోండి

### ఎన్ హెచ్ఆర్సికి న్యాయవాది ఫిర్యాదు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాది ఇమ్మనేని రామారావు జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్హెచ్ఆర్సీ)లో ఫిర్యాదు చేశారు. కంచ గచ్చిబౌలిపై చర్యలు తీసుకోండి ఎన్హెచ్ఆర్సీకి న్యాయవాది ఫిర్యాదు తెలంగాణ బ్యూరో ప్రతినిధి: పర్యావరణ నష్టాన్ని అంచనా వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారీతిన బుల్డోజర్లతో ప్రకృతి విధ్వంసానికి పాల్పడిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యలతో దాదాపు 27 ఎకరాల్లో సహజ సిద్ధంగా ఏర్పడిన సరస్సు, సుమారు 135 ఎకరాల్లో షీట్ రాక్స్, రెండున్నర ఎకరాల్లో కుంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఆ ఫిర్యాదును పరిగణ లోకి తీసుకుంటున్నట్లు రామారావుకు మానవ హక్కుల కమిషన్ సమాచారం ఇచ్చింది.

## బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని సీఎం రేవంత్.. హరీష్ ఎద్దేవా




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: విషయం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి బూతులు ఎత్తుకున్నారని హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. బేసిన్కు బాసిన్కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. శుక్రవారం మాజీ మంత్రి మాట్లాడుతూ.. డైవర్షన్ కోసమే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. 2016 ఎజెండా మినిట్స్ని రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని.. తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని 2016 మీటింగ్లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. బనకచర్లపై కేంద్ర జలశక్తి మీటింగ్లో ప్రభుత్వం తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలని డిమాండ్ చేశారు. విషయం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి బూతులు ఎత్తుకున్నారని వ్యాఖ్యలు చేశారు. బేసిన్కు బాసిన్కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పొరేషన్ ఏర్పడలేదని, టెండర్లు పిలివలేదని చెప్పుకొచ్చారు. చేతులు కాలినాక.. ఆకులు పట్టుకున్న చందంగా బీజేపీ తీరుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా.. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

### బీసీలపై కొనసాగుతున్న విపక్షకు

# సీఎం సొంత జిల్లానే నిదర్శనం

- గ్రామస్థాయిలో బీసీలు ఐక్యమైతే అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారం నల్లేరుపై నడకే ..
- విజయవంతంగా వికారాబాద్ జిల్లా బీసీ ముఖ్య నాయకుల సమావేశం..
- బీసీ రాజ్యాధికార సాధనే ధ్యేయంగా, గ్రామమే రాజకీయ యూనిట్‌గా కమిటీల నిర్మాణం షురూ ..
- ప్రతీ గ్రామం ఒక యూనిట్‌గా బీసీ ఐక్య వేదికల నిర్మాణం..
- గ్రామాల్లో బీసీలను గుడుంబా, చీప్ లిక్కర్‌కు బానిస చేసిన అగ్రవర్ణ పాలకులు..
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు భాధ్యత ఎవరిది?
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు మాని బీసీ రేజర్వేషన్ల పెంపుకు సమిష్టిగా కృషి చేయాలి..
- బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్




తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ముఖ్యమంత్రి సొంత జిల్లా వికారాబాద్ నందు నాలుగు నియోజకవర్గాలకు గాను కనీసం ఒక స్థానం కూడా బీసీలకు దక్కకపోవడం బీసీలపై కొనసాగుతున్న వివక్షకు ప్రత్యక్ష సాక్ష్యం అని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో బీసీలు ఐక్యమైతే రాజ్యాధికారం నల్లేరుపై నడకే అని దాసు సురేష్ తెలిపారు.. వికారాబాద్ జిల్లా వ్యాప్త బిసి ముఖ్య నాయకుల సమావేశాన్ని వికారాబాద్ పట్టణం నందుగల అశ్విత్ విలా నందు ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు నియోజకవర్గాల ముఖ్య నాయకులు కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామ గ్రామాన బీసీ జెండా ఎగరేస్తామని, గ్రామ స్వరాజ్యం సాధించాలంటే బీసీలకు రాజ్యాధికారం చేరువ కావాలని అందుకు తాము పూర్తిస్థాయిలో నిబద్ధతతో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు ప్రతి గ్రామాన్ని ఒక రాజకీయ యూనిట్ గా ఏర్పాటు చేసుకొని పూర్తిస్థాయి కమిటీలను జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గాల వ్యాప్తంగా మండల వారీగా, ఎన్నికలు ఎన్నికలు జరిగే ప్రతి చోట బీసీ ఐక్య వేదికలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామాలలో బీసీలను, అటుడుగు వర్గాలను చీప్ లిక్కర్లకు గుడుంబాకు పాలకవర్గాలు పరిమితం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు.. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్ల పెంపుపై ప్రధాన పార్టీలు దోబూచులాడుతున్నాయని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్లో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న విధంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని అధిగమించి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అందించాల్సిన గురుతర బాధ్యత తెలంగాణ ప్రభుత్వంపై ఉన్నదన్నారు..కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు మాని బీసీ రేజర్వేషన్ల పెంపుకు నిబద్ధతతో కృఎషి చేయాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలుగా కాలయాపన చేస్తుందే తప్ప అందుకు అవసరమైన జీవోను విడుదల చేయడం గాని రాజ్యాంగ సవరణకు ప్రయత్నం చేయడానికి పూనుకోకపోవడం విచారకరమని దాసు సురేష్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు, తమ ప్రాధాన్యత కలిగిన అంశాల పట్ల పలుమార్లు ప్రధానమంత్రిని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల రిజర్వేషన్ పెంపు కోసం కనీసం ఒక్కసారి కూడా కలవకపోవడం దారుణమన్నారు త్వరలోనే జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యవర్గ కమిటీలను గడప గడపను చేరుకొని బీసీల సభ్యత్వ నమోదు నమోదును సంపూర్ణంగా పూర్తి చేసి రాబోయే ఎన్నికల్లో బీసీలను బలమైన రాజకీయ శక్తిగా మారుస్తామన్నారు..

ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద వెంకటస్వామి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు బండారి పద్మావతి, బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ వికారాబాద్ జిల్లా నాయకులు రవీందర్ యాదయ్య గౌడ్ గార్ల పెల్లి రాములు, లాలయ్య ముదిరాజ్, జి శ్రీశైలం, జ్యోతి గౌడ్ నామ అనంతం, గాజుల ప్రభు, నామ ఆనందం, ఊట్ల నరేందర్, ఎర్ర లక్ష్మణ్ బాబు ,బాస నరసింహులు ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు..

## 29న నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రారంభం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఈనెల 29వ తేదీన నిజామాబాద్ లో పసువు బోర్డు ప్రారంభం కానుందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుదమ్ర తెలిపారు. శుక్రవారం బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుదమ్ర మాట్లాడారు. జూన్ 29వ తారీకు నాడు కేంద్ర హోం శాఖ మంత్రివర్యులు అమిత్ షా నిజామాబాద్ కు రాబోతున్నారు. పసువు రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు కలగడం కోసం, వారు పండిస్తున్నటువంటి పంటకు ధర రెట్టింపు అవ్వడం కోసం, అలాగే పసువు ప్రాసెసింగ్ యూనిట్స్ ద్వారా అనేక రకాల బైప్రొడక్ట్స్ తయారు చేసి అంతర్జాతీయంగా కూడా మార్కెటింగ్ చేసుకునే విధంగా.. రైతులకు మేలు చేసేలా నరంద్ర మోదీ నాయకత్వంలో నిజామాబాద్ లో ఏర్పాటు చేసిన జాతీయ పసువు బోర్డు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రివర్యులు అమిత్ షా కి తెలంగాణ రాష్ట్ర ప్రజల తరఫున ధన్యావాదాలు తెలియజేస్తున్నాం అని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గాని, గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి గాని కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వంలా స్పష్టమైన దిశలో వ్యవసాయ అభివృఎద్ధి చేసే సామర్థ్యం లేదు. 2014 నుండి 2025 వరకు కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం దాదావు లక్షల కోట్ల రూపాయలను తెలంగాణ వ్యవసాయ రంగానికి ఖర్చు చేసింది. కేవలం వడ్ల కొనుగోలుకు ఒక్కటే రూ. 57,556 కోట్లు ఖర్చు చేసింది. 2014లో వడ్ల కొనుగోలుకు ఖర్చు రూ. 3,404 కోట్లు కాగా, 2023-24 ఒక్క సీజన్కి రూ.20,998 కోట్లు ఖర్చు చేసింది. మొత్తం గా కేంద్రం ఈ కాలంలో వడ్ల కొనుగోలుకే ఖర్చు చేసిన మొత్తం రూ.57,556 కోట్లు.కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా తెలంగాణ రైతుల వద్ద నుంచి ఇప్పటివరకు రూ.58,000 కోట్ల విలువైన పత్తిని కొనుగోలు చేసింది. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 14 పంటలపై క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ మూడే పంటలకు మాత్రమే బోనస్ ప్రకటించి, వాటిలో సగం మంది రైతులకే ఇవ్వడం జరిగింది. మిగిలినవాళ్లకు ఇంకా అందలేదు. సగం మందికి మాత్రమే బోనస్ ఇస్తున్నామని చెప్పి, ఆ ప్రక్రియ కూడా పూర్తవ్వలేదు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసం. ఒక్క వరిగింజ లేకుండా, ఒక్క పత్తి బేలు కూడా లేకుండా కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర రైతుల దగ్గర నుంచి ఇప్పటికి రెండు లక్షల కోట్ల రూపాయలు పెట్టి కొన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీఇస్తా అన్నటువంటి బోనస్ బరాబర్ తెలంగాణ రైతులకు ఇవ్వాల్సిందేనని బిజెపి డిమాండ్ చేస్తున్నది. వచ్చే సీజన్ నుంచి, ఈ వానాకాలం నుంచి కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినటువంటి 14 పంటలకు రూ.500 బోనస్ ప్రతి పంటకు క్వింటాలుకు ఇవ్వాల్సిందే. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా 19 విడతలుగా ఇప్పటికీ తెలంగాణ రైతుల అకౌంట్లలో కేంద్ర ప్రభుత్వం వేసినటువంటి డబ్బు రూ.27,488 కోట్లు. ఈ 19 విడతలుగా తెలంగాణ రైతుల అకౌంట్లలో వచ్చిన పైసలు ఒక్కసారి కూడా బ్రేక్ కాలేదు. ఎప్పటికప్పుడు రైతులు ఎదురు చూడకముందే అకౌంట్లకు పైసలు వచ్చినాయి. మరి వరంగల్ రైతు డిక్లరేషన్ పెట్టి సోనియా గాంధీని, ప్రియాంకా గాంధీని, రాహుల్ గాంధీని పిలిచి, రాహుల్ గాంధీ చేత మాట్లాడిపించి వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట హామీలు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.15,000 రైతు భరోసా, ప్రతి కౌలు రైతుకు రూ.15,000 రైతు భరోసా, ప్రతి రైతు కూలీకి రూ.12,000 రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. 2023లో వీళ్ళు అధికారంలోకి వచ్చినప్పుడు అప్పుడు వానాకాలం పంటకు పెండింగ్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. 2024 యాసంగి ఇవ్వలే, వానాకాలం ఇవ్వలే. 2025లో మొన్న అయిపోయినటువంటి యాసంగి పంటకు సగం రైతులకు మాత్రమే ఇచ్చారన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ట్యాపింగ్ బాధితులు ఒక్కొక్కరుగా సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు తరలి వస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజు రోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ కేసులో విచారణను సిట్ అధికారులు వేగవంతం చేశారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుల విచారణలో ట్యాపింగ్కు సంబంధించిన ఆధారాలను సేకరించారు సిట్ అధికారులు. ఇప్పటికే వేల సంఖ్యలో ఫోన్లు ట్యాపింగ్ చేసినట్టు సిట్ బృఎందం గుర్తించింది. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ బాధితుల స్టేట్మెంట్లను సిట్ బృఎందం రికార్డ్ చేస్తోంది. ఇప్పటి వరకు 257 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల స్టేట్మెంట్లను రికార్డ్ చేసింది సిట్. కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది నాయకుల ఫోన్ నెంబర్లను ప్రభాకర్ రావు టీం ట్యాప్ చేసింది. ఈరోజు మరి కొంతమంది సాక్షుల వాంగ్మూలాలను రికార్డు చేయనున్నారు. 4200లకు పైగా ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తించారు. రాజకీయనాయకులు, గవర్నర్లు, హైకోర్టు జడ్జిలు, మీడియా, సినీ, ఫార్మా, ఐటీ ప్రముఖుల ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ తేల్చింది. ఇప్పటికే చేవెళ్ల ఎంపీ, బీజేపీ సీనియర్ నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డిని వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలని సమాచారం ఇచ్చింది సిట్ బృఎందం. ఈ క్రమంలో ఈరోజు (శుక్రవారం) సిట్ ముందుకు కొండా విశ్వేశ్వర్ రెడ్డి రానున్నట్లు తెలుస్తోంది. కాగా.. గత ఏడాది మార్చిలో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయ్యింది. దాదావు ఏడాదిగా ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కొనసాగుతోంది. ప్రభాకర్ రావు అమెరికాలో ఉండటంతో ఈ కేసు విచారణ ఆలస్యమైంది. ఇక ఎట్టకేలకు ప్రభాకర్ రావు అమెరికా నుంచి రావడంతో ఈ కేసులో విచారణను వేగవంతం చేసి సిట్. దాదావు నెల రోజులుగా ప్రభాకర్ రావును విచారిస్తున్న సిట్ బృఎందానికి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

## ఇందిరమ్మ క్యాంటీన్‌లలో రూ.5 లకే అల్పాహారం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: గ్రేటర్లోని రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాలకు ఇందిర క్యాంటీన్లుగా పేరు పెట్టాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అలాగే కేంద్రాల్లో భోజనంతో పాటు అల్పాహారం అందించాలని భావిస్తున్నారు. గ్రేటర్లోని రూ.5 అన్నపూర్ణ భోజన కేంద్రాలకు ఇందిర క్యాంటీన్లుగా పేరు పెట్టాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అలాగే కేంద్రాల్లో భోజనంతో పాటు అల్పాహారం అందించాలని భావిస్తున్నారు. ఈ మేరకు మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం చేశారు.

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
GHMC
సరూర్‌నగర్ సర్కిల్-5, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నిట్ నెం.08/EE5/SRNR/GHMC/2025-26, తేది: 27-06-2025
పని పేరు: (03) పనుల సంఖ్య "భవన నిర్మాణ పనులు, SWD నిర్మాణం & లిఫ్ట్ పనులు"
అంచనా వ్యయం: 51.10 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం: 04-07-2025 మ॥ 3.00 గం॥లకు. అధికారి పేరు మరియు చిరునామా: శ్రీ కె శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్ 5, GHMC, సెల్: 9989930602. తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.eprocurement.telangana.gov.in వద్ద చూడవచ్చును.
DIPR.RO.No.4271-PP/CL/Advt/1/2025-26 , Dt: 27-06-2025
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC

సూర్య
హైదరాబాద్
శనివారం
28 జూన్ 2025



సంపాదకీయం
editpage@suryaa.com

# మూడవ ఆర్ధిక శక్తిగా భారత్!

భారతదేశం ఈ శతాబ్దంలో ప్రపంచ ఆర్థిక రంగంలో వెలుగుతున్న నక్షత్రంగా మారుతోంది. శతాబ్దాల పాటు వలస పాలన, ఆర్థిక మాంద్యం, అభివృద్ధిలో లోపాలు భారతదేశాన్ని వెనక్కి నెట్టినప్పటికీ, స్వాతంత్ర్యానంతరం దేశం తనను తాను దశల వారీగా నిలబెట్టుకుంది. గత రెండున్నర దశాబ్దాలుగా దేశం చూపిస్తున్న ప్రగతి ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరుస్తోంది. ఈ నేపథ్యంలో బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ఆర్థిక సంస్థ తాజాగా ప్రకటించిన నివేదిక ప్రకారం, భారత్ 2028 నాటికి ప్రపంచ మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని సూచిస్తోంది. అయితే, ప్రస్తుత పరిస్థితులు, అభివృద్ధి వేగాన్ని పరిశీలిస్తే, భారత్ 2027 లేదా అంతకంటే ముందే ఈ ఘనత సాధించగలదు.

ఈ విజయానికి ప్రధానంగా మూడు కీలక అంశాలు కారణమవుతున్నాయి. అవి ఆర్థిక శక్తి, రక్షణ శక్తి, సాంకేతిక శక్తి. ఈ మూడు రంగాల్లో భారతదేశం సమన్వయంతో పనిచేస్తోంది. అలాగే, దేశం పాలిస్తున్న సమతుల్య, నిష్పాక్షిక విదేశాంగ విధానం ప్రపంచ దేశాల విశ్వాసాన్ని గెలుచుకుంటోంది.

ఆర్థిక రంగంలో భారతదేశం వేగవంతమైన అభివృద్ధిని చూపిస్తోంది. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవడానికి దేశం అగ్రగామిగా ఉంది. పారిశ్రామిక రంగం, సేవా రంగం, వ్యవసాయ రంగం, ఐటీ రంగంలో భారీ పెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా, డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంటర్నెట్ సదుపాయాలు పెరిగాయి. దీనివల్ల ఆన్‌లైన్ వ్యాపారం, వాణిజ్యం, ఉద్యోగ అవకాశాలు విస్తరిస్తున్నాయి. నగదు లావాదేవీలు సులభమయ్యాయి, పారదర్శకత పెరిగింది.

రక్షణ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధిస్తోంది. తేజస్ యుద్ధ విమానాలు, అగ్ని క్షిపణులు, బ్రహ్మోస్ వంటి ఆధునిక ఆయుధాలను తయారు చేస్తూ, సైనిక బలాన్ని బలోపేతం చేస్తోంది. నౌకా, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ ఆధునికీకరణలో గణనీయమైన పురోగతి సాధించబడింది.

సాంకేతిక రంగంలో భారతీయులు ప్రపంచానికి ప్రతిభను చాటుతున్నారు. బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలు టెక్నాలజీ హబ్‌లుగా మారాయి. అంతరిక్ష పరిశోధనలో భారత్ గగన్ యాన్, చంద్రయాన్, మంగళయాన్ వంటి విజయాలను సాధించింది. ఈ విజయాలు భారత శాస్త్రవేత్తల ప్రతిభను ప్రపంచానికి చాటుతున్నాయి.

భారతదేశం అనుసరిస్తున్న సమతుల్య విదేశాంగ విధానం కూడా దేశ అభివృద్ధికి బలమైన మద్దతు. రష్యా, అమెరికా, యూరోప్, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా దేశాలతో సఖ్యత కొనసాగిస్తూ, దేశం అన్ని శక్తుల మద్దతును పొందుతోంది. ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో భారత్ తటస్థంగా ఉండటం, అంతర్జాతీయ వేదికల్లో విశ్వాసాన్ని పెంచింది.

దేశంలో యువ జనాభా అత్యధికంగా ఉంది. 140 కోట్ల జనాభాలో సగం 35 ఏళ్ల లోపు యువత ఉండటం దేశానికి ప్రత్యేక బలంగా మారుతోంది. యువత సాంకేతిక రంగాల్లో సత్తా చూపిస్తోంది. భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ ఈకోసిస్టమ్ కలిగి ఉంది.

దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకమైంది మౌలిక వసతుల అభివృద్ధి. రవాణా మార్గాలు, మెట్రో, విమానాశ్రయాలు, బులెట్ ట్రైన్ వంటి ప్రాజెక్టులు దేశ ఆర్థిక చక్రాలను వేగవంతం చేస్తాయి. విదేశీ పెట్టుబడులు దేశంలో ప్రవాహం పెరగడం కూడా ప్రధాన కారణం.

అవినీతి నియంత్రణ, విద్య, ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి భారత్ స్వయం సమృద్ధి సాధిస్తోంది. కరోనా సమయంలో టీకాల ఉత్పత్తి ప్రపంచ దేశాలకు అందించడం ద్వారా భారత దేశం వైద్య రంగంలో గ్లోబల్ హబ్ గా నిలిచింది. 5జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్పేస్ టెక్నాలజీ, రిన్యూవబుల్ ఎనర్జీ వంటి రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి దేశ ఆర్థిక అవకాశాలను విస్తరిస్తుంది.

భారతదేశం ఆర్థికంగా సాధిస్తున్న అభివృద్ధి గణాంకాలను పరిశీలిస్తే, ఇది ఎంత ప్రగతిశీల దేశమో స్పష్టమవుతుంది. ప్రస్తుతం భారత్ జీడీపీ సుమారుగా 3.7 ట్రిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉంది. ప్రపంచంలో ఆర్థిక పరంగా అమెరికా మరియు చైనా తర్వాత మూడవ స్థానంలో ఉంది. బ్రిటన్ నివేదిక ప్రకారం, ఈ వృద్ధి రేటు ప్రతివారం సుమారు 7 శాతం ఉండగలదు అంటే 2028 నాటికి భారత్ ఆర్థిక పరంగా మూడో స్థానం ఆక్రమించే అవకాశం ఉంది. భారతదేశంలో 140 కోట్ల మందికి పైగా జనాభా ఉండగా, వీరిలో సగం 35 ఏళ్ల కంటే తక్కువ వయస్సులో ఉన్న యువత. ఈ యువత భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఇంధనంగా మారుతోంది. 2030 నాటికి దేశం ప్రపంచంలోనే అత్యధిక శ్రామిక శక్తి కలిగిన దేశంగా నిలవనుంది. ఇదే విధంగా, దేశంలో స్టార్టప్ వ్యవస్థ కూడా భారీగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం భారత్‌లో 80,000కి పైగా స్టార్టప్స్ ఉన్నాయి, వీటిలో 100కి పైగా "యూనికార్న్" స్థాయి కంపెనీలుగా ఎదిగాయి. వీటి ద్వారా వేలాదిగా ఉద్యోగాలు, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధి నిండుతున్నాయి. భారతీయ ఐటీ రంగం కూడా ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంది. 2023లో భారత ఐటీ రంగం మొత్తం ఆదాయం సుమారు 227 బిలియన్ డాలర్లను తాకింది. ఈ రంగంలో భారత దేశం ప్రపంచ వ్యాప్తంగా 55 శాతం మార్కెట్ భాగస్వామ్యం కలిగి ఉంది. రక్షణ రంగంలో, భారత్ స్వదేశీ ఆయుధాల తయారిలో సుమారు 70 శాతం భాగస్వామ్యాన్ని సాధించింది. గత పది సంవత్సరాల్లో రక్షణ పరిశ్రమ వార్షిక వృద్ధి రేటు సుమారు 12 శాతంగా ఉంది. అంతరిక్ష పరిశోధన రంగంలో, ఇస్రో 2022లో 40 మందికి పైగా ఉపగ్రహాలను ప్రయోగించింది. ఈ ప్రయోగాలు భారతదేశం అంతరిక్ష రంగంలో 15% మార్కెట్ వాటా సంపాదించడంలో సహాయపడ్డాయి. భారతదేశానికి విదేశీ పెట్టుబడులు కూడా పెరుగుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో దేశంలో వచ్చిన విదేశి పెట్టుబడులు మొత్తం సుమారు 84 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇది గత ఏట కంటే 25 శాతం ఎక్కువ. వీటితో పాటు, దేశంలోని రవాణా, మౌలిక వసతుల రంగంలో కూడా బహుముఖ అభివృద్ధి జరుగుతోంది. 2025 నాటికి దేశంలో కొత్త రైలు మార్గాలు 12,000 కి పైగా నిర్మాణం పూర్తి చేయనున్నారు. అలాగే, భారతదేశంలో ఇప్పటి వరకు 70 పైగా మెట్రో ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. ఈ గణాంకాలు భారతదేశ ఆర్థిక, సాంకేతిక, రక్షణ రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సూచిస్తున్నాయి. తద్వారా 2028 నాటికి ,ఇంకా చెప్పాలంటే ఇంకా ముందే భారత్ ప్రపంచ మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలవగలదని స్పష్టం అవుతుంది. ఆర్థిక శక్తి, సాంకేతిక నైపుణ్యం, రక్షణ బలం మరియు సమతుల్యమైన విదేశాంగ విధానాలతో భారత్ భవిష్యత్తులో గ్లోబల్ సూపర్‌పవర్‌గా ఎదుగుతుంది. 2028 అన్నది బ్రిటన్ అంచనా అయినా ఇంకా ముందే కూడా మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలవవచ్చు. ఇది కేవలం ఒక గమ్యం కాదు, భారత దేశ ప్రజల కృషి, నాయకత్వం, దేశ భక్తి సంకల్పం ఫలితం. ఈ మార్గంలో ప్రతి ఒక్కరి బాధ్యత మరింత పెరుగుతుంది. మనం మన సంస్కృతిని, యువ శక్తిని, సాంకేతిక విజ్ఞానాన్ని సమన్వయపరచి, దేశాన్ని అగ్రరంగంలో నిలబెట్టుకోవాలి. భారత్ ఇప్పుడు కేవలం అభివృద్ధి చెందుతున్న దేశంగా మాత్రమే కాక, ప్రపంచ మార్పులకు దారితీసే ప్రగతిపథంలో ఉన్న విశ్వనాయకుడిగా మారబోతుంది.

# మేయర్ పోటీలో సంచలనం-జోహ్రాన్ మమ్దానీ

■ న్యూయార్క్ మేయర్ రేసులో జోహ్రాన్ సంచలనం ■ మార్పు కోసం మమ్దానీ పయనం
■ ప్రైమరీ గెలుపుతో చరిత్ర సృష్టించిన జోహ్రాన్ ■ వలసదారుల హక్కుల యోధుడి నుంచి మేయర్ అభ్యర్థి వరకు ■ జోహ్రాన్ విజయంపై వలసదారుల ఆశల భారం



తేజస్వి
హైదరాబాద్

న్యూయార్క్ నగరంలో రాజకీయ హవా మారుతోంది. మార్పు కోసం ఎదురుచూస్తున్న ప్రజల ఆశలకు జోహ్రాన్ మమ్దానీ రూపంగా నిలిచే అవకాశంగా నిలిచాడు.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభివృద్ధి శీల ప్రజాస్వామ్య దేశాలలో ఒకటైన అమెరికా పాలనాపరంగా ప్రత్యేక గుర్తింపు పొందిన దేశం. ఆ దేశంలో ప్రముఖ నగరాలలో అత్యంత ప్రాధాన్యం గల నగరం న్యూయార్క్ సిటీ. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే నగరాల్లో ఇది అగ్రస్థానంలో ఉంటుంది. అంతేకాదు, న్యూయార్క్ నగరం రాజకీయంగా కూడా ఎంత ప్రభావవంతమో అందరికీ తెలిసిందే.

ఆ నగరానికి నాయకత్వం వహించే మేయర్ పదవి సాధించాలంటే, సామాన్య రాజకీయ నాయకుడికి సాధ్యపడదని చెబుతుంటారు. ఎందుకంటే, అక్కడ రాజకీయ సమీకరణాలు క్లిష్టంగా ఉంటాయి. బలమైన సామాజిక నేపథ్యం, ఆర్థిక వనరులు, రాజకీయ అనుభవం ఉన్నవారే సాధారణంగా మేయర్ పదవిని అందుకుంటారు. కానీ, ఈ తరుణంలో ఓ యువ నాయకుడు సంప్రదాయాలను, సిద్ధాంతాలను తుడిచిపెట్టేలా ప్రజల మద్దతుతో ముందుకు వస్తుండటం విశేషం. అతనే జోహ్రాన్ మమ్దానీ.

**జోహ్రాన్ మమ్దానీ ఎవరు?**

జోహ్రాన్ క్వామే మమ్దానీ 1991లో యుగాండా రాజధాని కంపాలాలో జన్మించారు. ఆయన పేరు "క్వామే" అనగా ఘనా స్వాతంత్ర్య నాయకుడు క్వామే నక్రమా గారిని స్మరించుకుని, ఆయన తండ్రి పెట్టారు. జోహ్రాన్ ప్రముఖ ఇండియన్–అమెరికన్ ఫిల్మ్ దర్శకురాలు మీరా నాయర్ మరియు కొలంబియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మహమూద్ మమ్దానీల కుమారుడు. జోహ్రాన్ చిన్నతనాన్ని కంపాలాలో గడిపిన తర్వాత, తన కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్‌లో స్థిరపడింది, అక్కడ ఆయన సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో చదువుకున్నారు. ఈ స్కూల్ దక్షిణాఫ్రికాలోని అత్యంత పురాతన విద్యాసంస్థలలో ఒకటి. ఆయన తండ్రి మహమూద్ మమ్దానీ అక్కడ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన ఏడు ఏళ్ల వయసులో అమెరికా న్యూయార్క్‌కు వలస వచ్చారు. అక్కడ బ్రాంక్స్ హైస్కూల్ ఆఫ్ సైన్స్‌లో తన విద్యను కొనసాగించారు. తరువాత 2014లో బోడన్ కాలేజీ నుండి ఆఫ్రికన్ స్టడీస్‌లో బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేశారు. జోహ్రాన్ మమ్దానీ 2018లో అమెరికా పౌరుడిగా మారి, అమెరికా రాజకీయాల్లో అడుగుపెట్టారు. జోహ్రాన్ మమ్దానీ తన యువతనాన్ని, అనుభవాలను, సామాజిక–రాజకీయ అంశాలపై సుదీర్ఘ పరిశీలనతో సమర్థవంతంగా ఉపయోగిస్తూ, న్యూయార్క్ నగర రాజకీయాల్లో తన ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఆయన ప్రత్యేకతగా వలసదారుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాలపై దృష్టి సారించి, ప్రగతిశీల రాజకీయ దృక్పథంతో ప్రజల హృదయాలను గెలుచుకున్నారు.

**జోహ్రాన్ మమ్దానీ రాజకీయ ప్రస్థానం**

జోహ్రాన్ మమ్దానీ తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించే ముందు సామాజిక సేవా రంగంలో చురుకుగా పనిచేశారు. ముఖ్యంగా న్యూయార్క్ నగరంలోని క్వీన్స్ ప్రాంతంలో 'ఫోర్‌క్లోజర్ కౌన్సిలర్'గా పని చేశారు. ఆ సమయంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోకుండా ఉండేందుకు ఆయన వారికి సలహాలు, మార్గదర్శకత అందించేవారు. ఈ సేవా ప్రయాణంలో మమ్దానీకి ఒక ముఖ్యమైన స్పష్టత కలిగింది.

ఇళ్లను కోల్పోతున్న వారిని చూస్తే ఇది కేవలం వ్యక్తిగత ఆర్థిక సమస్య కాదు, దీని వెనుక ఉన్నత స్థాయి విధానాల్లో ఉన్న లోపాలే కారణమని ఆయన గ్రహించారు. ప్రభుత్వ విధానాలు మారితేనే వాస్తవికంగా సామాన్య ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన అర్థం చేసుకున్నారు. ఈ అనుభవమే ఆయనను రాజకీయ రంగంలోకి ప్రవేశించేందుకు ప్రేరేపించింది. వ్యవస్థను మార్చాలంటే, ప్రజల కోసం నేరుగా పోరాడే స్థానంలో ఉండాలని భావించి, మమ్దానీ 2020లో తొలిసారి ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పట్లో న్యూయార్క్ అసెంబ్లీకి చెందిన 36వ జిల్లా (క్వీన్స్‌లోని ఆస్టోరియా) నుండి డెమోక్రటిక్ సోషలిస్ట్ పార్టీ తరఫున తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. యువత, వలసదారులు, తక్కువ ఆదాయ గృహాల ప్రజల మద్దతుతో మమ్దానీ తన తొలి ఎన్నికల్లోనే విజయం సాధించారు. ఆ విజయంతో జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీలో తొలిసారి దక్షిణాసియన్గా, అలాగే సోషలిస్టు దృక్పథంతో ఎన్నికైన ప్రతినిధిగా చరిత్ర సృష్టించారు.

అంతే కాదు, ఇప్పుడు న్యూయార్క్ నగర మేయర్ పదవికి జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ఆయన సంచలన విజయం సాధించారు. మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోను ఓడించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. 2021లో లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో పదవికి రాజీనామా చేసిన క్యూమో, తిరిగి రాజకీయాల్లోకి రావాలనే లక్ష్యంతో మేయర్ పోటీ చేశారు. అయితే, ప్రజలు ఆయనను తిరస్కరించి, మమ్దానీకి మద్దతు ప్రకటించారు. ప్రైమరీలో గెలిచిన తర్వాత మమ్దానీ తన ప్రసంగంలో ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "ఈ రోజు మనం చరిత్రను సృష్టించాం. నెల్సన్ మండేలా చెప్పినట్లు %–% ఏదైనా సాధ్యమయ్యేంతవరకు అది అసాధ్యంగానే కనిపిస్తుంది. కానీ మిత్రులారా, మనం సాధించాం. న్యూయార్క్ మేయర్ అభ్యర్థిగా ప్రజల నమ్మకాన్ని పొందడం నాకు గౌరవంగా ఉంది," అని ఆయన చెప్పారు.

**జోహ్రాన్ మమ్దానీ వ్యక్తిత్వం, దృష్టికోణం**

జోహ్రాన్ మమ్దానీని పరిశీలిస్తే, ఆయన కేవలం రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా, సామాజిక శ్రేయస్సును ఉద్దేశించిన యోధుడిగా కనిపిస్తారు. ఆయనలోని ప్రత్యేకత, ఆయన రాజకీయ ఆలోచనలు చిన్ననాటి అనుభవాలే ముడిపడి ఉన్నాయి. వలసదారుల కష్టాలు ఆయనను ఆకళింపు చేసాయి. ఒక వైపు తల్లిదండ్రులు విద్య, సినీ రంగాల్లో ఉన్నా, ఆయన తన దారిని పూర్తిగా సామాజికంగా తీర్చిదిద్దుకున్నారు. జోహ్రాన్ మమ్దానీ కేవలం ఓ నాయకుడిగా కాకుండా, కళారంగం పట్ల కూడా ఆసక్తి చూపిన వ్యక్తి. విద్యార్థి దశలో ఆయన హిప్–హాప్ సంగీతం, పొయెట్రీ, సామాజిక సమస్యలపై ప్రదర్శనలు ఇచ్చారు. వీటిలోనూ ఆయనకు మార్పు కోసం పనిచేయాలన్న ఆలోచన చొప్పించింది. అంతేగాక, జోహ్రాన్ మమ్దానీ వలసదారుల హక్కులకు నిలబడే వ్యక్తిగా అమెరికాలో గుర్తింపు తెచ్చుకున్నారు. అమెరికాలో నివసిస్తున్న వివిధ దేశాల ప్రజల సమస్యలను దగ్గరగా చూస్తూ, వారికి హక్కులు అందేలా కార్యకలాపాలు చేపట్టారు. మమ్దానీ పాలకుల మీద, సామాజిక విధానాల మీద ఘాటు విమర్శలు చేస్తూ ప్రజల తరఫున నిలబడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆయన మాటల్లో, "ఒక దేశం అభివృద్ధి చెందాలంటే ముందు సామాజిక సమానత్వం అవసరం. వలసదారులు, పేదలు, కార్మికులు సురక్షితంగా జీవించే దేశమే నిజమైన ప్రజాస్వామ్యం" అనే భావన స్పష్టంగా కనిపిస్తుంది.

అత్యంత ఆసక్తికర విషయం ఏమిటంటే, అమెరికాలో రాజకీయంగా వలసదారులకు పెద్దగా అవకాశం లేని సమయంలో, దక్షిణాసియా మూలాలు కలిగిన వ్యక్తిగా ఆయన న్యూయార్క్ రాజకీయాల్లో బలమైన స్థానాన్ని ఏర్పరచుకోవడం. అలాగే, మమ్దానీ మానవహక్కుల కార్యకర్తలతో, సామాజిక సంస్థలతో గట్టి సంబంధాలు కొనసాగిస్తారు. ప్రజా పోరాటాల్లో, నిరసన కార్యక్రమాల్లో నడుచుకుని వెళ్లే నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గృహ హక్కులు, విద్య, ఆరోగ్య పరిరక్షణపై ఆయన సాగించే చర్చలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి.

సాధారణంగా అమెరికా రాజకీయాల్లో మేయర్ పదవి కోసం పోటీ చేసే అభ్యర్థులు కొందరు మాత్రమే ప్రజలతో నేరుగా మమేకమవుతారు. కానీ, మమ్దానీ నిత్యం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడంలో ఆసక్తి చూపుతారు. అదే కారణంగా, మమ్దానీ రాజకీయాలు అనేవి కేవలం ఓట్లు గెలవడానికి కాదు, ప్రజల సమస్యలకు పరిష్కారం కోసం అని స్పష్టమవుతుంది. ప్రపంచ రాజకీయ వేదికపై న్యూయార్క్ నగరానికి ఉన్న ప్రాముఖ్యత అందరికీ తెలిసిందే. ఆ నగరానికి మేయర్‌గా ఏ వ్యక్తి బాధ్యతలు చేపడతాడో, ఆయన విధానాలు, ఆలోచనలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత ఏ స్థాయిలో ఉంటుందో అన్నది నగరాన్ని మాత్రమే కాకుండా అమెరికా దేశాన్ని, కొంతవరకూ ప్రపంచ దిశను మార్చగలదు. అటువంటి కీలకమైన హోదాకు యువ నాయకుడు, వలసదారుల ఆశల చిరునామాగా మారిన జోహ్రాన్ మ.

అది సామాజిక పోరాటానికి ప్రతిరూపం. పేదవర్గాల కోసం, కార్మికుల కోసం, వలసదారుల కోసం, విద్య, ఆరోగ్య రంగాల్లో సమానత్వం కోసం సాగుతున్న ఉద్యమానికి ఈ ఎన్నికలు ఒక కీలక మలుపు. జోహ్రాన్ మమ్దానీ వ్యక్తిత్వం చూస్తే, ఆయన తన వ్యక్తిగత ప్రయోజనాలకు బదులుగా సమాజం కోసం పని చేయాలనే తపన కనిపిస్తుంది. సంప్రదాయ రాజకీయాలను ఛల్లుమనిపిస్తూ, సామాజిక సేవను రాజకీయ శక్తిగా మార్చేందుకు ఆయన చేస్తున్న కృషి నిజంగా ప్రశంసనీయం. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు చక్కని నాయకత్వం అవసరం. సమస్యల పరిష్కారానికి మాత్రమే కాకుండా, భవిష్యత్తును నిర్మించే దిశగా ఆలోచించగల నాయకుడు కావాలి.

ఆ అవసరాన్ని తీర్చగల సామర్థ్యం జోహ్రాన్ మమ్దానీలో ఉంది. ఈ నేపథ్యంలో, ఆయన విజయం సాధిస్తే అది కేవలం వ్యక్తిగత గెలుపు కాదు. అది వలసదారులకు, సామాజిక న్యాయానికి, సమాన అవకాశాలకు ఒక పెద్ద విజయంగా నిలవనుంది.

న్యూయార్క్ నగరం కొత్త దిశలో, సమగ్ర అభివృద్ధి వైపు సాగేందుకు ఇది ఒక మంచి అవకాశం. ప్రజల తీర్పు ఏదైనా కావొచ్చు%ా% కానీ మార్పు కోసం పోరాడుతున్న మమ్దానీ లాంటి నాయకుల అవసరం న్యూయార్క్‌కు మాత్రమే కాదు, ప్రపంచానికి కూడా ఉంది.

# దారి తప్పిన బాల్యం - ఎవరిది తప్పు?

జి. అజయ్ కుమార్

■ చిన్ని చేతుల్లో స్మార్ట్ఫోన్ ఆలోచనల్లో ఆందోళన
■ పిల్లల్లో నానాటికి పెరిగిపోతున్న నేర పూరిత స్వభావం
■ చిన్నతనంలోనే వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు ఏమవుతుంది?

**ఇ**టీవల జరిగిన కొన్ని సంఘటనలు మనల్ని తీవ్ర ఆవేదనలో ముంచుతున్నాయి. ఫోన్ ఇవ్వలేదని, మొబైల్ లో గేమ్ ఆడనివ్వలేదని 12, 14, సంవత్సరాల పిల్లలు ప్రాణాలు తీసుకోవడం, తన ప్రేమను అడ్డు వస్తుందని పదవ తరగతి బాలిక వాళ్ల తల్లిని చంపడం , వంటివి ఎన్నో సంఘటనలు నిత్యం నేటి సమాజంలో జరుగుతున్నాయి, వీటిని మనం ఎప్పుడైనా ఊహించమా? ఒక్కసారి ఆలోచించండి . ఏ వయసులో జీవితం ప్రారంభించాలో ఆ వయసులోనే జీవితం ముగింపు చూపడం ఎలాంటి ప్రమాదకర పరిస్థితికి సంకేతం?

**దీనికి బాధ్యులెవరు ?**

పిల్లలను చిన్నతనం నుండి పద్ధతిగా పెంచకుండా విలువలు నేర్పకుండా మంచి చెడు చెప్పకుండా పెంచితే వారు పెద్దవాళ్ళు అయ్యాక దాని పర్యవసానలు చాలా ప్రమాదకరంగా ఉంటాయి అవి కుటుంబం మీదే కాకుండా సమాజం మీద కూడా చెడు ప్రభావాన్ని చూపిస్తాయి .

ఒకప్పుడు అమ్మ చందమామను చూపిస్తూ అన్నం తినిపించేది ఇప్పుడు మొబైల్ చూపిస్తూ తినిపిస్తుంది అదే వ్యసనంగా మారి పిల్లలలో మానసిక వైకల్యానికి దారి తీస్తుంది .తల్లిదండ్రులు తమ ప్రశాంతత కోసం పిల్లలకు మొబైల్ ఫోన్లు అలవాటు చేస్తే భవిష్యత్ లో ఎవ్వరికీ ప్రశాంతత లేకుండా చేస్తున్నారనేది నిజం .దానితో పాటు నేడు పాఠశాల, కళాశాలల స్థాయిలోనే పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలుగా మారి టీనేజ్ వయసు కూడా దాటకముందే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం , నేరస్తులుగా మారడం అనేది కూడా ఆందోళన కలిగించే అంశం. ఇది ప్రతీ ఇంట్లో, సమాజంలోనూ, దేశంలోని బలంగా చర్చించాల్సిన అంశం.

**బాల్యం భవిష్యత్తుకు పునాది:**

బాల్యం అనేది ఒక వ్యక్తి జీవితానికి పునాది. అది బలంగా విలువలతో కూడి ఉంటేనే%ా% మనిషి మంచి జీవితాన్ని నిర్మించుకోగలడు కానీ అదే బాల్యం దారి తప్పితే%ా% జీవితం దిక్కుతెలియని దారిలో నడుస్తుంది. అదే కాకుండా కుటుంబం, సమాజం, దేశం కూడా దాని పర్యవసానాలు ఎదుర్కొంటుంది

ఒకప్పుడు మట్టిలో ఆడిన బాల్యం ఇప్పుడు స్క్రీన్లోనే బంధించబడింది. చెట్టు కింద కథలు విన్న ఆ రోజులు ఇప్పుడు ఆన్లైన్ ఆటలతో సాగిపోతోంది. స్నేహితులతో పెట్టిన ముచ్చట్లు నవ్వుకున్న రోజులు ఇప్పుడు సోషల్ మీడియా మాయలో కనుమరుగుతున్నాయి. పిల్లలకు నీతి కథలు చెప్పేవారు కరువయ్యారు, ఉమ్మడి కుటుంబాలు లేక పెద్ద వారి పర్యవేక్షణ లోపించి పిల్లలలో మానసిక వికాసాన్ని పెంపొందించే విధానం లోపించింది .

**నేటి బాల్యంలో కనిపిస్తున్న ప్రమాదకర ఛాయలు:**

మొబైల్ స్క్రీన్ బానిసత్వం, ఒంటరితనం, మూడ్ స్వింగ్స్, మానసిక

**ఒత్తిడి, డిప్రెషన్ :**

మత్తుపదార్థాల వ్యసనం , చిన్న వయసులో ఆత్మహత్యల యత్నాలు, నేర పూరిత స్వభావం , ఈ పరిస్థితులన్నీ మాటల్లో చెప్పదగ్గవే కాదు. గణాంకాలు కూడా చెబుతున్నాయి

**గణాంకాల చెబుతున్న కటిన నిజాలు :**

ఇటీవల ఒక సంస్థ లెక్కల ప్రకారం 12–17 ఏళ్ల వయసు పిల్లల్లో 26% మంది డిజిటల్ అడిక్షన్ బారినపడ్డారు. వారిలో డిప్రెషన్ కేసులు కూడా 40% వరకు పెరిగాయి

**ఔనూ హెచ్చరిక:**

రోజుకి 2 గంటలకంటే ఎక్కువ స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల్లో మానసిక



స్థిరతపై తీవ్రమైన ప్రభావం పడుతోంది దీని వలన మానసిక కుంగుబాటు, ఒంటరితనం , ఆత్మహత్య అలోచనలు కలుగుతాయి చైల్డ్ లైన్ నివేదిక ప్రకారం బాలలపై వేధింపుల కేసులు 300% వరకు పెరిగాయి. యూ నే స్ ఫ్ లెక్కల ప్రకారం భారతదేశంలో మత్తుపదార్థాల తొలిసారి వినియోగం వయస్సు సగటున 11.5 ఏళ్లు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఈ పరిస్థితికి బాధ్యులెవరు? తల్లిదండ్రుల నిర్లక్ష్యం:**

పిల్లల్ని ఏడవకుండా ఉంచేందుకు ఫోన్ ఇవ్వడం, ప్రేమను పంచకుండా స్క్రీన్ని ప్రత్యామ్నాయంగా ఉపయోగించడం, ఎప్పుడూ బిజీగా ఉండి వారితో రోజుకు కొంత సమయం కూడా గడపకపోవడం, పిల్లలకు వ్యక్తిగత గదులు ఇచ్చి వాళ్ళు ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు వంటివి పట్టించుకోవడం.

**విద్యా వ్యవస్థ వైఫల్యం:**

మార్కులు , ర్యాంకుల మాత్రమే ప్రాధాన్యంగా నడిచే విద్యాసంస్థలు ఆటలకు, భావోద్వేగాలకు, విలువలు నేర్పడానికి మొగ్గు చూపకపోవడం విలువలతో కూడిన విద్యా బోధన లేకపోవడం.. విద్యాలయాల్లో పిల్లలు ఎం చేస్తున్నారు, చేడు అలవాట్లకు ఏమన్నా బానిసలుగా మారుతున్నారా అనే పరివేక్షణ లేకపోవడం సాంకేతికత దుర్వినియోగం:

హింసాత్మక, అసభ్య కంటెంట్ సులభంగా అందుబాటులో ఉండటం, ప్రతి ఇంట్లో ఇంటర్ నెట్ అందుబాటులోకి రావడం, పిల్లలు ఎం చేస్తున్నారు, ఏం చూస్తున్నారో తల్లి దండ్రులు పట్టించుకోవడం వల్ల వారికి స్వేచ్ఛ పెరగడం, గేమ్స్, రీళ్ల వ్యాసని కంగా కలుషితవరచడం

**సమాజపు మౌనం :**

పిల్లల ఆటలకు స్థలాల లేమి, మితిమీరిన పోటీ వాతావరణం, పిల్లల ప్రవర్తనను గమనించకుండా పెద్దలు తమ జీవితాల్లోనే బిజీగా గడపడం, పిల్లలతో సమయం గడపకపోవడం వంటివి ఇలాంటి దుష్పరిణామాల కు కారణంగా ఉన్నాయి.

ఇప్పుడు మేల్కొకపోతే భారీమూల్యం తప్పదు.

**తల్లిదండ్రులు ఆలోచించాలి:**

పిల్లులు మొబైల్ చూసే స్క్రీన్ టైమ్పై పరిమితి విధించాలి. పిల్లలతో రోజూ కనీసం 1 గంట కలసి గడపాలి. ప్రేమతో కూడిన సంభాషణలు, విలువల బోధన అవసరం. ప్రకృతి, పుస్తకాలు, ఆటలవైపు వారిని ప్రోత్సహించాలి

**విద్యా వ్యవస్థలలో మార్పు రావాలి:**

సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలి. విలువల బోధనను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. ఆటలు తప్పనిసరి భాగంగా ఉండాలి. పిల్లల మనోభావాలను గుర్తించి ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలి .

**ప్రభుత్వం, పాలకుల బాధ్యత:**

హానికర కంటెంట్పై నియంత్రణ విధించాలి. స్క్రీన్ టైమ్ నియంత్రణ విధానాలు పెట్టాలి .గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య సలహాలు (కౌన్సిలింగ్) అందుబాటులోకి తేవాలి.

**సమాజం , స్వచ్ఛంద సంస్థల పాత్ర:**

కథా వేదికలు, ఆటల పండుగలు నిర్వహించాలి. పల్లెల్లో పిల్లల క్లబ్బు, కథా వనాలు, గ్రంథాలయాలు ఏర్పాటుచేయాలి. మానవతా సంస్థల ద్వారా చైతన్య కార్యక్రమాలు జరగాలి. నేర రహిత సమాజాన్ని నిర్మించాలంటే చిన్నతనం నుండే పిల్లలకు విలువలు, సంస్కారం తో కూడిన నడవడినకు అలవాటు చేయాలి. బాల్యం మొగ్గలాంటింది. దానిని ఎలా పెంచుతామో అలాగే అది వికసిస్తుంది. ప్రేమతో, సహనంతో, మంచి విలువలతో బాల్యాన్ని బలంగా తీర్చిదిద్దితే రేపటి సమాజం కూడా బాగుంటుంది.

తిరిగి రానిది ఎంతో మధురమైనది బాల్యం దానిని వ్యసనాలకు బానిసలు .మార్చుకొని భవిష్యత్తును అంధకారంగా మార్చుకోకండిలి .నేటి బాలలే రేపటి దేశభవిషత్తు అలాంటి భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ, వ్యవస్థలకు వుంది. బాల్యాన్ని జ్ఞాపకంగా మార్చుకోండి గాయంగా కాదు.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H.
NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.



# జగన్నాథ రథ యాత్రలో అపశృతి..

**భక్తులపైకి దూసుకెళ్లిన ఏనుగు!**

గుజరాత్లోని గోల్వాడ దగ్గర జగన్నాథ రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. యాత్రలో భాగంగా ఉన్న ఏనుగు ఒక్కసారిగా భక్తులపైకి దూసుకెళ్లింది. దీంతో భక్తులంతా భయంతో బయటికి పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాటలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కాగా, ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా పూరీ జగన్నాథ రథయాత్ర..ఒడిశాలోని ప్రసిద్ధ పూరీ జగన్నాథ రథయాత్ర ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. కన్నుల పండుగగా జరిగే ఈ యాత్రను చూడడానికి దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ రథయాత్రలో భక్తులు జగన్నాథుడు, ఆయన సోదరసోదరీమణులు బలభద్రుడు, సుభద్రలకు చెందిన రథాలను లాగుతారు. ఈ ముగ్గురు దేవుళ్లు ముందుగా గుండిచా ఆలయానికి వెళ్లి అక్కడ కొంత కాలం గడుపుతారు. తరువాత అక్కడ నుంచి జగన్నాథ ఆలయానికి తిరిగి వస్తారు. అంటే జూన్27న మొదలైన ఈ రథయాత్ర జులై 8న ముగ్గురు దేవతలు తమ ప్రధాన మందిరానికి తిరిగి రావడంతో ముగుస్తుంది. 12వ శతాబ్దం నుంచి నేటి వరకు ఏటా పూరీ జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా జరుగుతూనే ఉంది.భద్రతా ఏర్పాట్లు..పూరీ జగన్నాథుని రథయాత్రకు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో అధికారులు 10,000 మంది భద్రతా సిబ్బందిని నియమించారు. వీరిలో ఒడిశా పోలీసులు సహా సెంట్రల్ ఆర్మ్డ్ ఫోర్స్ (సీఏపీఎఫ్)కు చెందిన 8 కంపెనీలు ఉన్నాయి. నిఘా కోసం పోలీసులు పూరీ పట్టణంలో 250కి పైగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్–ఎనేబుల్డ్ కెమెరాలు అమర్చారు.

# భారత్‌పై పాక్ మరో భారీ కుట్ర

- ధ్వంసమైన ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణం..?
- పహల్గామ్ దాడి తర్వాత తీవ్రంగా నష్టపోయిన పాక్
- అయినా తన బుద్ధి మార్చుకోని శత్రుదేశం పాకిస్థాన్

న్యూఢిల్లీః పహల్గామ్ దాడి తర్వాత తీవ్రంగా నష్టపోయిన పాకిస్థాన్ తన బుద్ధిని మాత్రం మార్చుకోవడం లేదు. పాక్ మరోసారి భారతదేశంపై పెద్ద కుట్రకు పాల్పడుతోందని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా దాయాది దేశంలో ధ్వంసమైన ఉగ్రవాద లాంచింగ్ ప్యాడ్లు, శిక్షణా కేంద్రాలను పునర్నిర్మిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ముఖ్యంగా పీవోకే లోని దట్టమైన అడవుల్లో ఈ కార్యకలాపాలు కనిపిస్తున్నాయని ఓ జాతీయ మీడియా సంస్థ కథనం వెల్లడించింది.

నివేదిక ప్రకారం.. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆదేశ సైన్యం, ప్రభుత్వం ఈ ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రత్యక్షంగా మద్దతు ఇస్తున్నాయి. ఇటీవల బహవల్పూర్లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ శిబిరాలను తిరిగి స్థాపించాలని నిర్ణయించారు. జైష్–ఎ–మొహమ్మద్, లష్కరే–ఎ–తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, టీఆర్ఎఫ్ వంటి ఉగ్రవాద సంస్థల అగ్ర కమాండర్లతో పాటు పాక్ సైన్యం, ఐఎస్ఐ సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.నిఘా సంస్థల సమాచారం ప్రకారం.. ఈసారి ఉగ్రవాద శిబిరాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు అమర్చనున్నారు.

తద్వారా భారత నిఘా సంస్థలు వాటిని చేరుకోవడం కష్ట తరంగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఈ శిబిరాల భద్రతా బాధ్యతను పాకిస్థాన్ సైన్యంలోని ప్రత్యేక భద్రతా గార్డులకు అప్పగించారు. వారు డ్రోన్లు, థర్మల్ సెన్సార్లు, నైట్ విజన్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పరికరాల సహాయంతో ఈ ప్రాంతాలను పర్యవేక్షిస్తారు. ఈసారి ఉగ్రవాద సంస్థలు తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి. ఇప్పుడు ఒక శిబిరంలో 200 కంటే తక్కువ మంది ఉగ్రవాదులను ఉంచుతారట. భారతీయ ఏజెన్సీలకు ట్రాక్ చేయడం కష్టతరం అయ్యేలా అనేక చిన్న శిబిరాలను నిర్మిస్తున్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే, ఉగ్రవాదులను వెంటనే సరిహద్దు వైపు పంపుతారు.ఈ సమాచారం అందిన తర్వాత, భారత భద్రతా సంస్థలు నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీపంలో కార్యకలాపాలపై తమ పర్యవేక్షణను మరింత ముమ్మరం చేశాయి.



సైన్యం, నిఘా సంస్థలు హై అలర్ట్ జారీ చేశాయి. పీఓకేలో ఈ స్థావరాలను తిరిగి ఏర్పాటు చేస్తున్న వారిపై ఉపగ్రహ చిత్రాలు, గ్రౌండ్ ఇంటెలిజెన్స్ ద్వారా నిఘా పెంచారు. కాగా.. ఆపరేషన్ సింధూర్ కింద భారత భద్రతా సంస్థలు పాకిస్థాన్లోని అనేక ఉగ్రవాద లాంచ్ ప్యాడ్లను ధ్వంసం చేశాయి. వాటిలో లూని, పుత్వాల్, భైరోనాథ్, పిపి ధన్దర్, టిప్పు, ముంతాజ్ కాంప్లెక్స్, జమీల్, సైధ్వాలి, ఉమ్రానాల్వి బంకర్, చాప్రార్ ఫార్వర్డ్, చోటా చక్ పోస్ట్, అఫ్జల్ షహీద్ పోస్ట్, జంగ్లోరా పోస్ట్ ఉన్నాయి. కానీ ఇప్పుడు ఈ ప్రదేశాలన్నింటిలోనూ వాటిని కొత్త మార్గాల్లో తిరిగి సిద్ధం చేసే కసరత్తు ప్రారంభమైంది.

## స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోవద్దు: జైశంకర్



ఒకే ఒక్క కుటుంబం వల్ల దేశంలో అత్యయిక పరిస్థితి ఏర్పడిందంటూ కేంద్ర మంత్రి జైశంకర్ కాంగ్రెస్ను పరోక్షంగా దుయ్యబట్టారు. కుర్చీ కోసం వారు ఏదైనా చేస్తారంటూ విమర్శలు గుప్పించారు. ఎమర్జెన్సీ ప్రకటించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ హయాంలో విధించిన ఎమర్జెన్సీ వల్ల దేశవ్యాప్తంగా చాలామంది జైళ్లలో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందని గుర్తుచేశారు. దేశంలో కాంగ్రెస్ హయాంలో అవినీతి పెరిగిపోవడం, ద్రవ్యోల్బణం ఎక్కువవడం వల్ల ప్రభుత్వానికి ప్రజాదరణ బాగా పడిపోయిందని జైశంకర్ అన్నారు. స్వేచ్ఛను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోవద్దనే పాఠాన్ని అత్యవసర పరిస్థితి నుంచి దేశం నేర్చుకుందని అన్నారు.

అంతర్గత కారణాల వల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లినట్లు పేర్కొంటూ నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీఅహ్మద్ 50 ఏళ్ల క్రితం 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించారని జైశంకర్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ భారత రాజ్యాంగ విలువలను పక్కనపెట్టిందని.. ప్రజల ప్రాథమిక హక్కులు నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పట్లో దేశ పౌరులు, పత్రికల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ తీవ్ర అణచివేతకు గురయ్యాయని, సుమారు 1.5 లక్షల మంది జైలు పాలైనట్లు తెలిపారు. అందువల్లే జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా జరుపుకున్నామన్నారు. కొంతమంది వ్యక్తులు రాజ్యాంగాన్ని పట్టుకొని ప్రజల్లో తిరుగుతారే కానీ.. వారి ఉద్దేశాలు మాత్రం రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా ఉంటాయని విమర్శించారు. తాము చేసిన తప్పుల గురించి కాంగ్రెస్ నేతలు ఎప్పుడూ విచారం వ్యక్తంచేయరని.. వారి నిర్ణయాలు తప్పని ఒప్పుకోరని దుయ్యబట్టారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితికి 50 ఏళ్లు పూర్తవడంతో నాటి పరిస్థితులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహించింది. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, ఎమర్జెన్సీ నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించినట్లు కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇందులోభాగంగా అత్యవసర పరిస్థితికి సంబంధించిన అన్ని చట్టపరమైన రికార్డులను సేకరించి.. భావితరాల కోసం వాటిని భద్రపరచాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు.



### చెస్ తగ్గని మమకారం

# అంతర్జాతీయ పోటీలకు సై అంటున్న సురేశ్

ఇష్టం, కష్టపడేతత్వం ఉంటే ఏ రంగాల్లోనైనా రాణించొచ్చు. అదే మరోసారి నిరూపించాడా యువకుడు. చిన్నతనంలోనే చెస్పై పట్టు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు కొల్లగొట్టాడు. చెస్ ఒక్కటే కాదు. యోగా, నృత్యం, పాటల విభాగాల్లోనూ ఎన్నో అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నాడు. పైచదువుల కోసం లండన్ వెళ్లినా చెస్పై మమకారంతో తిరిగొచ్చి, అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధమవుతున్న విజయవాడకి చెందిన తేజ సురేశ్ క్రీడా ప్రయణం చూసేయండి.

చదరంగంలో తనదైన ముద్ర వేస్తున్న ఈ కుర్రాడు తేజ సురేశ్. అన్న సుబ్రమణ్యం ఆడుతుండగా చూసి చెస్ ఆసక్తి పెంచుకున్నాడు. ఐదో తరగతిలోనే తనూ చెస్ పావులను చేతుల్లోకి తీసుకున్నాడు. శిక్షణ తీసుకుని అనతికాలంలోనే జాతీయ, అంతర్జాతీయ పోటీలో పతకాలు సాధించి ఎలో రేటింగ్ పెంచుకున్నాడు. గ్రాండ్ మాస్టర్ కావాలన్నదే లక్ష్యం అంటున్నాడు సురేశ్. విజయవాడకు చెందిన మేరుగు సాంబశివరావు, పార్వతికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సురేశ్ పదేళ్ల ప్రాయంలోనే చెస్ ఆడటం ప్రారంభించాడు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. 2012 నుంచి 2019 వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడి స్వర్ణం, రజతం, కాంస్యం పతకాలు సాధించాడు.'స్టార్టింగ్లో మా బ్రదర్ బాగా ఆడేవాడు చెస్. దాంతో నాకు ఇంట్రెస్ట్ పెరిగింది. చిన్న పిల్లాడిని వద్దు, రాదు అని చెప్పినా నేను ఇంట్రెస్టా నేర్చుకున్నాను. కోచ్ బొబ్బా వద్ద శిక్షణ తీసుకున్నాను. జాయిన్ అయిన సంవత్సరం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఛాంపియన్ షిప్స్ గెలిచాను. 2012 నుంచి 2016 వరకు నేషనల్, ఇంటర్నేషనల్ లెవల్లో మెడల్స్ సాధించాను. గ్రాండ్ మాస్టర్ కావాలన్నదే నా లక్ష్యం.' – తేజ సురేశ్, వర్ధమాన చెస్ క్రీడాకారుడుచదరంగంతో పాటు యోగా, నృత్యంలో సాధన: కరోనా సమయంలో తండ్రి చనిపోవడం, పైచదువులకు లండన్కు వెళ్లడంతో చెస్ పోటీలకు కొన్నాళ్లు విరామమిచ్చాడు సురేశ్. గ్యాప్ తర్వాత మళ్లీ అంతర్జాతీయ టోర్నీలకు సన్నద్ధమవుతున్నాడు. రోజు చెస్ ఆడటం వల్ల ఆలోచనా సామర్థ్యం మెరుగుపడుతోందని చెబుతున్నాడు సురేశ్. మనల్ని మనం విశ్లేషించుకోవడంతో పాటు తప్పులు తెలుసుకుంటామంటున్నాడు.

సురేశ్ చదరంగంతో పాటు యోగా, నృత్యం, గాత్రం విభాగాల్లో సాధన చేసేవాడని తల్లి పార్వతి చెబుతోంది. ఎన్ని విభాగాల్లో రాణించినప్పటికీ చెస్ పైనే ప్రధానంగా దృష్టి సారించాడని అంటోంది. చదరంగంలో పతకాలు సాధిస్తూనే చదువులో రాణించడంపై కోచ్ వీఆర్ బొబ్బా హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న అంతర్జాతీయ టోర్నీల్లోనూ సురేశ్ గెలుస్తాడనే నమ్మకం ఆయన వ్యక్తం చేశారు.'చెస్లో 5 ఇంటర్నేషనల్ మెడల్స్ను సాధించడమే కాకుండా, ఎడ్యుకేషన్లో ఇంజనీరింగ్ కేఈసీలో పూర్తి చేశాడు. మాస్టర్స్ యూకేలో చేశాడు. తనకు చెస్ మీద ఉన్న ప్రేమతో , తన తల్లి ప్రోత్సాహంతో మళ్లీ చెస్లో ప్రాక్టీస్ చేయడం మొదలు పెట్టాడు. రీసెంట్గా జరిగిన ఓపెన్ టోర్నమెంట్లో ఫస్ట్ ప్లేస్ను కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ టోర్నీల్లోనూ గెలుస్తాడనే నమ్మకం ఉంది.' – వీఆర్ బొబ్బా, చదరంగం కోచ్.

# ఉద్యోగ సాధనలో కోడింగ్ ఎంతో కీలకం - ఉచితంగా నేర్పిస్తున్న ఐఐటీయన్

మారుతున్న కాలంతో పాటు వినూత్న సేవలందించేందుకు పెద్దఎత్తున కంపెనీలు రావడంతో పాటు, యువతకు పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి. ఐతే ఆ కొలువులకు సరైన నైపుణ్యాల్ని మాత్రం విద్యాసంస్థలు అందించలేకపోతున్నాయి. ఇంజినీరింగ్ చదివినా ఎంటెక్ చేసినా, మళ్లీ ఉద్యోగం కోసం ఇతర నైపుణ్య కోర్సుల్ని నేర్చుకోవాల్సి వస్తుంది. ఇదే అంశంపై దృష్టి సారించాడా యువకుడు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతకు అవసరమైన కోడింగ్ పాఠాలను ఉచితంగా నేర్పిస్తున్న ఐఐటీయన్పై ప్రత్యేక కథనం.

అధునాతన సాంకేతిక యుగంలో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలు ఉన్న యువతకు మంచి వేత నాలతో కార్పొరేట్ సంస్థలు స్వాగతం పలుకుతున్నాయి. కంపెనీలు కోరుకునే స్కిల్స్ లేనప్పుడు. డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ లాంటి కోర్సులు చేసిన వారికి ఉద్యోగాలు దొరకడం లేదు. ఎంత పెద్ద కళాశాల నుంచి డిగ్రీ, పీజీలు చేసినా తిరిగి విద్యార్థులు ఇతర నైపుణ్య కోర్సులు నేర్చుకోక తప్పడం లేదు.

ఉద్యోగ సాధనలో ఎంతో కీలకంగా మారిన కోడింగ్ లాంటి కోర్సులను విద్యార్థులకు ఉచితంగా నేర్పిస్తున్న ఈ యువకుడి పేరు రామాంజిరెడ్డి. పల్నాడు జిల్లా వితంరాజుపల్లి స్వస్థలం. చిన్నతనం నుంచి చదువులో ప్రతిభ చూపడంతో తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. బీటెక్ ఎలక్ట్రానిక్స్, ఐఐటీ బాంబే నుంచి ఎంటెక్ పూర్తి చేసి. అమెరికాలో కొలువు పట్టాడు. ఐతే స్వదేశంపై మమకారంతో భారత్కు తిరిగొచ్చి బెంగళూరులో ప్రముఖ కంపెనీలో ఉద్యోగంలో సాధించాడు.

కోడింగ్పై ఉచితంగా పాఠాలు బోధన: నేర్చుకున్న విద్య పదిమందికి సాయపడాలని తన తల్లిదండ్రుల ఎప్పుడూ చెబుతూ ఉండే వారని దానిని ఆచరణలో పెట్టేందుకు కరోనా మహమ్మారి మార్గం చూపిందని చెబుతున్నాడు రామాంజిరెడ్డి. లాక్డౌన్ వల్ల వర్క్ఫ్రమ్ హోం విధానం రావడంతో సొంత గ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి ఖాళీ సమయాల్లో స్థానిక విద్యార్థులకు కఠినమైన కోడింగ్ అంశాలపై ఉచితంగా పాఠాలు బోధిస్తున్నానని వివరించాడు.

బెంగళూరు, హైదరాబాద్ నగరాలను వదిలిపెట్టి, యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే ఉద్దేశంతో సొంత గ్రామానికి తిరిగొచ్చానని చెబుతున్నాడు రామాంజిరెడ్డి. 15 నుంచి 17 ఏళ్లు పాటు కష్టపడి చదివిన సబ్జెక్టులు, అర్జించిన విజ్ఞానం పూర్తిగా ఉపయోగపడని పరిస్థితి. దీనిని దృష్టిలో పెట్టుకొని కోడింగ్ విషయంలో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి భారీ ప్యాకేజీలతో కొలువులు సాధించేలా కృషి చేస్తున్నాడీ యువకుడు.

'నేను రైతు కుటుంబంలో పుట్టి,పెరిగాను. గవర్నమెంట్ స్కూల్లో చదివాను. ఐఐటీలో ఎంటెక్ చేశాను. కొవిడ్ తర్వాత నుంచి కొంతమంది పిల్లలకు ఐఐటీ, మ్యాథ్స్, ఫిజిక్స్లో కోచింగ్ ఇచ్చాను. దాని వల్ల ఎక్కువమంది లాభం పొందడం చూసి, అది నాకు సంతృప్తిని ఇచ్చింది. నాకు మా తల్లిదండ్రులు ఎప్పుడు చెప్తూ ఉండే వాళ్లు నలుగురికీ సహాయం చేయాలని, నా మాట నా మైండ్లో ఉండిపోయింది. దాంతో నేను ప్రోగ్రామింగ్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. ప్రోగ్రామింగ్ అనేది విద్యార్థులకు చాలా ఉపయోగం.' –రామాంజిరెడ్డి, ఐపీఆర్ ప్రోగామింగ్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడుతండ్రి గుర్తుగా ప్రోగ్రామింగ్ ఇనిస్టిట్యూట్: కరోనా సమయంలో తండ్రి చనిపోవడంతో ఆయన గుర్తుగా ఐపీఆర్ ప్రోగ్రామింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేశాడీ యువకుడు. ఎలక్ట్రానిక్స్ చదివినప్పటికీ ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతిక అంశాలపై పట్టు సాధించాడు. ప్రస్తుత తరుణంలో ఏ విభాగంలో ఇంజినీరింగ్, పీజీలు చేసినా, కోడింగ్ కీలకమని గుర్తించాడు. అలాంటి కోడింగ్ విద్యను వినుకొండ పరిసర ప్రాంతాల విద్యార్థుల కు చేరువ చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.చదువుతో పని లేకుండా ఆసక్తి ఉన్న పదోతరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐఐటీ విద్యార్థు లకు



కోడింగ్ పాఠాలు నేర్పిస్తున్నాడీ యువకుడు. భార్య రాజ శ్రీ సహకారంతో ఇంటి నుంచి సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ ప్రాంతాలకు చెందిన యువతకు సాంకేతిక విద్యలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాడు.దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ బాంబే, గౌహతి, సూరత్, మద్రాసు లాంటి విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ చేస్తున్న యువత. సెలవుల్లో రామాంజిరెడ్డి దగ్గర కోడింగ్ పాఠాలపై శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 150 మందికి పైగా తర్ఫీదు పొంది టీసీఎస్, జియో లాంటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ఇంజినీరింగ్ చేసిన వారే కాకుండా ఇంటర్, డిగ్రీ పాసైన వారు కుడా వివిధ సాంకేతిక అంశాలపై శిక్షణ తీసుకుంటున్నారని వివరించారు. టెక్నాలిజీలో వెనుకబడిన పల్నాడు ప్రాంతాన్ని భవిష్యత్తులో కోడింగ్ కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెబుతున్నాడు రామాంజిరెడ్డి.

## వైట్‌హౌస్ ఆదేశాలే మోదీ సర్కారుకు శిరోధార్యం

**ట్రంప్ 'బిగ్ డీల్' వ్యాఖ్యలపై కాంగ్రెస్ రియాక్షన్!**



న్యూఢిల్లీ : త్వరలోనే భారత్తో చాలా పెద్ద వాణిజ్య ఒప్పందం జరగబోతోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్రంలోని మోదీ సర్కారు తీరును చూస్తుంటే, వైట్హౌస్ నుంచి వెలువడే నిర్ణయాలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా కనిపిస్తోందని విమర్శించింది. వాణిజ్య ఒప్పందాన్ని అస్త్రంగా ప్రయోగించి భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణను సాధించానని 16 సార్లు చెప్పిన తర్వాత, భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ ప్రకటన చేశారని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇంఛార్జి) జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ పెట్టారు.

"కాల్పుల విరమణకు భారత్, పాక్లను ఒప్పించడానికి వాణిజ్య ఒప్పందాన్నే అస్త్రంగా ఉపయోగించానని 16 సార్లు చెప్పిన తర్వాతే, భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ ప్రకటన చేశారు. ఇంకొన్ని రోజుల్లోనే ఇరుదేశాలు డీల్పై సంతకాలు చేయబోతున్నాయని అమెరికా అధ్యక్షుడు అంటున్నారు. ఆపరేషన్ సిందూర్ను అకస్మాత్తుగా ఆపేందుకు ఉపయోగపడినందు వల్లే దాన్ని ట్రంప్ 'చాలాపెద్ద డీల్' అని ట్రంప్ చెప్పుకుంటున్నారు. వాషింగ్టన్లోని వైట్ హౌస్ నుంచి వెలువడే నిర్ణయాలే మోదీ సర్కారుకు ముఖ్యమైనవిగా మారిపోయాయని దీంతో తేటతెల్లమైంది"అని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.ఇంకొన్ని రోజుల్లోనే వాణిజ్య ఒప్పందంపై భారత్, అమెరికా సంతకాలు చేస్తాయని ఎట్టకేలకు ఇప్పుడు ట్రంప్ ప్రకటన చేశారన్నారు. తాజాగా వాషింగ్టన్లోని వైట్హౌస్లో జరిగిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు దీనిపై అనౌన్స్మెంట్ చేశారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు ప్రధాన సంధానకర్త (చీఫ్ నెగోషియేటర్) రాజేశ్ అగర్వాల్ సారథ్యంలోని భారత టీమ్ గురువారమే అమెరికాకు చేరుకుంది. ఏప్రిల్ 2న భారత ఎగుమతులపై సుంకాలను ప్రకటించిన ట్రంప్, జులై 9 వరకు వాటి అమలును ఆపేశారు. ఆలోగా తమ దేశంతో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని అల్టిమేటం ఇచ్చారు. దీంతో జులై 9లోగా అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకునేందుకు భారత్ సిద్ధమవుతోంది.

**రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎన్నడూ అంగీకరించలేదు**

మరోవైపు బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎన్నడూ అంగీకరించలేదని జైరాం రమేశ్ ఆరోపించారు. రాజ్యాంగ పీఠికలోని సోషలిస్ట్, సెక్యులర్ అనే పదాలను సమీక్షించాలని ఆర్ఎస్ఎస్ గురువారం రోజు పిలుపునివ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలనే కుట్రలో భాగంగానే ఇలాంటి ప్రతిపాదనలను ఆర్ఎస్ఎస్ తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. 1949 నవంబరు 30న నుంచే భారత రాజ్యాంగ నిర్మాణంలో భాగమైన అంబేద్కర్, నెహ్రూ తదితరులను విమర్శించే పనిని ఆర్ఎస్ఎస్ మొదలు పెట్టిందన్నారు."భారత రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎన్నడూ సంపూర్ణంగా అంగీకరించనే లేదు. భారత రాజ్యాంగ నిర్మాణంలో భాగమైన డాక్టర్ అంబేద్కర్, నెహ్రూ తదితరులను 1949 నవంబరు 30 నుంచే ఆర్ఎస్ఎస్ విమర్శించడం మొదలుపెట్టింది. భారత రాజ్యాంగం మనుస్మృతికి అనుగుణంగా లేదు అనేదే ఆర్ఎస్ఎస్ ఆవేదన. నూతన రాజ్యాంగాన్ని రూపొందించాలని చాలాసార్లు ఆర్ఎస్ఎస్, బీజేపీ డిమాండ్ చేశాయి. 2024 లోక్సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఎన్నికల నినాదం కూడా అదే. దాన్ని తిరస్కరిస్తూ దేశ ప్రజలు నిర్ణాయక తీర్పు ఇచ్చారు. అయినప్పటికీ రాజ్యాంగపు మౌలిక స్వరూపాన్ని మార్చాలనే వాదనను ఆర్ఎస్ఎస్ వినిపిస్తూనే ఉంది. ఈ అంశంపైనే 2024 నవంబరు 25న నాటి భారత ప్రధాన న్యాయమూర్తి కీలక తీర్పును వెలువరించారు. అయినా అదే అంశంపై ఓ ఆర్ఎస్ఎస్ ప్రముఖ నేత ఇటీవలే వ్యాఖ్యలు చేశారు. కనీసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును చదివేందుకైనా వాళ్లు చొరవ చూపాలి కదా?"మనుస్మృతి ఆధారంగా భారత రాజ్యాంగ రచన జరగలేదు అనేదే ఆర్ఎస్ఎస్ ఆవేదన అని జైరాం రమేశ్ విమర్శించారు. దేశానికి కొత్త రాజ్యాంగం అవసరమని గతంలో ఆర్ఎస్ఎస్, బీజేపీలు పిలుపునిచ్చిన సందర్భాలు ఉన్నాయన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే 2024 లోక్సభ ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలు తగిన శాస్తి చేశారని ఆయన పేర్కొన్నారు. అయినా ఇప్పటికీ భారత రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్ ఏడుస్తూనే ఉందన్నారు. భారత రాజ్యాంగ పీఠికపై 2024 నవంబరు 25న నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా కీలక తీర్పు ఇచ్చిన విషయాన్ని జైరాం రమేశ్ గుర్తుచేశారు. కనీసం ఆ తీర్పును చదువుకోవాలని గురువారం రోజు రాజ్యాంగ పీఠికపై వ్యాఖ్యలు చేసిన ఆర్ఎస్ఎస్ నేత దత్తాత్రేయ హొసబలేకు సూచించారు.

**వాణిజ్య ఒప్పందం– భారత్, అమెరికా ప్రతిపాదనలు ఇవే!**

వాణిజ్య ఒప్పందం విషయంలో భారత్, అమెరికా పరస్పరం పలు ప్రతిపాదనలు చేస్తున్నాయి. జులై 9లోగా వాటిపై ఏకాభిప్రాయానికి వచ్చే లక్ష్యంతో ఇరుదేశాల ప్రతినిధులు వాషింగ్టన్ వేదికగా చర్చలు జరపనున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, డెయిరీ సెక్టార్లలో పన్ను రాయితీలను అమెరికా కోరుతోంది. పారిశ్రామిక సరుకులు, ఆటో మొబైల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, డెయిరీ ఉత్పత్తులు, యాపిల్స్, డ్రై ఫ్రూట్స్, జన్యు మార్పులు చేసిన పంటలపై పన్నురాయితీలు ఇవ్వాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. వస్త్ర ఉత్పత్తులు, రత్నాలు, బంగారు ఆభరణాలు, లెదర్ ఉత్పత్తులు, గార్మెంట్లు, ప్లాస్టిక్లు, రసాయనాలు, రొయ్యలు, నూనె విత్తనాలు, ద్రాక్షలు, అరటిపండ్లపై పన్ను రాయితీలను భారత్ కోరుతోంది.



# కల సాకారం చేసుకుంటున్న తెలుగమ్మాయి

**అంతరిక్ష యాత్ర చేయనున్న జాహ్నవి**

అమ్మమ్మా, ఆ చంద్రుడు, నేను ఎక్కడికి వెళ్ళినా, అక్కడికే వస్తున్నాడు?' 'నిన్ను తన దగ్గరకు రమ్మని పిలుస్తున్నాడు లేమ్మా' చిన్నారి అడిగిన ప్రశ్నకు బామ్మ ఇలా సరదాగా సమాధానమిచ్చింది. కానీ ఆ పాప మాత్రం దాన్ని సరదాగా తీసుకేలేదు. అంతరిక్షంలోకి అడుగు పెట్టాలని, చుక్కల అంచులను తాకాలని అనుకుంది. అనుకున్నట్టుగానే కల సాకారం చేసుకుంటోంది జాహ్నవి దంగేటి. తాజాగా అంతరిక్ష యాత్ర చేసే అవకాశాన్ని దక్కించుకున్న తెలుగమ్మాయి.

అమ్మమ్మ మాట, తను చెప్పే చంద్రుడు – పేదరాసి పెద్దమ్మ కథల పుణ్యమో ఆ చిన్నారికి చంద్రుడిపై ఆసక్తి కలిగింది. నేను అక్కడికి వెళ్లి, పేదరాసి పెద్దమ్మ ఇచ్చే బహుమతులు తెచ్చుకోవాలి అనుకునేదాన్ని. పెద్దయ్యాక ఏమవుతావని ఎవరైనా అడిగినప్పుడల్లా చంద్రుడి మీదకు వెళ్తాననేదాన్ని. ఒక పెద్ద నిచ్చెనతో ఎక్కేస్తా అనీ చెప్పేదాన్ని. అలాంటి నాకు 11 సంవత్సరాల వయసులో నాసా పరిచయమైంది' అని గుర్తు చేసుకుంది జాహ్నవి. ఈమెది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. అమ్మానాన్నలు శ్రీనివాస్, పద్మశ్రీ.తన కల దిశగా ప్రయాణం: వ్యోమగామి అవ్వాలన్న లక్ష్యం ఏర్పడ్డాక దాని గురించి సమాచారం సేకరించడం మొదలు పెట్టాను. 16 సంవత్సరాల వయసులో 'ఇస్రో వరల్డ్ స్పేస్ వీక్' లో పాల్గొంది. అక్కడ ఎంపికైన 2000 ప్రాజెక్టుల్లో తనదీ ఒకటి. అలా ఆ చిన్నారి తన కల దిశగా ప్రయాణం ప్రారంభించింది. ఆస్ట్రోనాట్లకు అవసరమని స్కూబా డైవింగ్నీ ప్రయత్నించిందంటే అన పట్టుదలేంటో అర్థం చేసుకోవచ్చు.

అంతేకాదు, దేశంలోనే అతి చిన్న వయసులో అడ్వాన్స్ స్కూబా డైవర్గానూ కూడా నిలిచింది. జాహ్నవి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చదివింది. బీటెక్ చేస్తున్నప్పుడే, నాసా పదిరోజుల ప్రోగ్రామ్కి ఎంపికైంది. ఆ అవకాశాన్ని పొందిన మొదటి భారతీయురాలు జాహ్నవి. మిషన్ డైరెక్టర్గా మినీ రాకెట్, అండర్ వాటర్ రాకెట్ లాంచ్లోనూ భాగమైంది. ఆ అనుభవం 2022వ సంవత్సరంలో పోలాండ్లో లూనార్ మిషన్లో పాల్గొనే అవకాశాన్ని ఇచ్చింది.

'అక్కడ అచ్చం చంద్రుడిపై ఉండే వాతావరణమే ఉంటుంది. కాకపోతే అది మానవ నిర్మితం. ఆ వాతావరణంలో12 రోజులు గడిపాను. ఆ రోజు నా ఐదేళ్ల నాటి కల నిజమైంది' అంటుంది జాహ్నవి. అతిపిన్న వయస్కురాలైన అనలాగ్ వ్యోమగామిగా గుర్తింపు పొందిన జాహ్నవి, ఐస్లాండ్లో జరిపే జియాలజీ శిక్షణకు ఎంపికైన తొలి భారతీయురాలు కూడా మరి.రెండు సూర్యోదయాలు – రెండు సూర్యాస్తమయాలు: 2023లో ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఆస్ట్రోనాటికల్ సైన్స్లో చేరే అవకాశం వచ్చింది. ఇదివరకే ఒకసారి తిరస్కరణకు గురైంది, జాహ్నవికి అది గొప్ప అవకాశమే. అక్కడు సిమ్యులేషన్స్, ఫ్లైట్ ఎక్సర్సైజెస్, మిషన్ డ్రిల్స్ వంటి అనేక విషయాల్లో నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంది.

ఇటీవలే అంతరిక్షంలోకి అడుగుపెట్టే అవకాశాన్నీ అందుకుంది. అమెరికాకు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్' చేపట్టిన 'టైటాన్ స్పేస్ మిషన్'కి వ్యోమగామి క్యాండిడేట్గా జాహ్నవి ఎంపికైంది. దీనికోసం మూడు సంవత్సరాల పాటు ఆస్ట్రోనాట్ ట్రైనింగ్లో పాల్గొంటుంది. ఫ్లైట్ సిమ్యులేషన్, స్పేస్క్రాఫ్ట్ ప్రొసీజర్లు, సర్వైవల్ ట్రైనింగ్, మెడికల్, సైకలాజికల్ అసెస్మెంట్లు ఇందులో భాగంగానే ఉంటాయి. ఇది పూర్తయిన తర్వాత 2029లో 5 గంటల పాటు ఆర్బిటర్ స్పేస్ ఫ్లైట్లో ప్రయాణించనుంది జాహ్నవి.అమ్మాయిలకు సులువు కాదన్న మాటలు : 'మానవ అంతరిక్ష ప్రయాణంలో ఇది ఒక ముందడుగు. ఈ ప్రయాణంలో రెండు చొప్పున సూర్యోదయాలు, సూర్యాస్తమయాలను గమనించనున్నాం. ఈ అవకాశం అందుకోవడం గొప్పగా భావిస్తున్నా' తన ప్రయాణంలో ఎన్నో గుర్తింపులూ, అవార్డులూ అందుకుంది. అడ్వెంచర్ స్పోర్ట్స్లో రికార్డులు కూడా సృష్టించింది. అలాగని తన ప్రయాణమేమీ సులభమైనది కాదు.'అమ్మాయిలకు సులువు కాదన్న' మాటలు, రోజులపాటు శిక్షణలో భాగంగా ప్రపంచానికి, అయినవాళ్లకు దూరంగా ఉండాలి, సరైన ఆహారము కూడా ఉండదు. కానీ ఇవన్నీ కలల సాధనలో మామూలే అనుకుంటూ ముందుకు సాగింది జాహ్నవి. అంతేకాకుండా, 'పట్టుదల ఉండాలే కానీ ఏదీ అసాధ్యం కాదని' యువతలో స్ఫూర్తినీ నింపుతోంది 23 సంవత్సరాల అమ్మాయి. అంగారకుడిపై అడుగుపెట్టాలి, భవిష్యత్ అంతరిక్ష కార్యక్రమాలలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాలన్నవి తన లక్ష్యాలు.

# ఢాకాలో దుర్గా మాత ఆలయం కూల్చివేత..

ఢాకా : బంగ్లాదేశ్లో మైనారిటీలు ముఖ్యంగా హిందువుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. తాజాగా, ఆ దేశ రాజధానిలో దుర్గా మాత ఆలయాన్ని కూల్చివేశారు. బంగ్లాదేశ్లో మైనారిటీల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై భారత్ నుంచి తీవ్ర ప్రతిస్పందన వచ్చింది. మరోవైపు, బంగ్లాదేశ్ అధికారులు ఈ చర్యను సమర్థించారు. ఆలయం తాత్కాలిక నిర్మాణం అని, చట్టవిరుద్ధంగా నిర్మించారని పేర్కొన్నారు.

"ఢాకాలోని ఖిలే?త్ లోని దుర్గా ఆలయాన్ని కూల్చివేయాలని అరాచకవాదులు నినాదాలు చేస్తున్నారని మేము అర్థం చేసుకున్నాము. తాత్కాలిక ప్రభుత్వం, ఆలయానికి భద్రత కల్పించడానికి బదులుగా, ఈ సంఘటన అక్రమ భూ వినియోగం కేసుగా చిత్రీకరించి, ఆలయాన్ని నాశనం చేశారు" అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. " దీని ఫలితంగా దేవతను మరో ప్రదేశానికి తరలించే ముందు నష్టం వాటిల్లింది. బంగ్లాదేశ్ లో ఇలాంటి పునరావృతం కావడం పట్ల మేము నిరాశ చెందాము. హిందువులను, వారి ఆస్తులను మరియు వారి మత సంస్థలను రక్షించడం బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ బాధ్యత అని నేను నొక్కి చెబుతున్నాను" అని జైస్వాల్ అన్నారు.

గతేడాది ఆగస్టులో షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి భారత్ పారిపోయి వచ్చారు. ఆ తర్వాత మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి హిందువుల ఆస్తులు, ఆలయాలు, వ్యాపారాలను లక్ష్యంగా చేసుకుంటూ మతఛాందసవాదులు దాడులకు పాల్పడుతున్నారు. పలు సందర్భాల్లో భారత్ తమ ఆందోళన వ్యక్తం చేసింది. బ్యాంకాక్లో జరిగిన బిమ్స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో ఇద్దరు నాయకుల మధ్య జరిగిన సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, యూనస్తో ఈ అంశాన్ని లేవనెత్తారు.

ఆలయాన్ని కూల్చివేయాలని మతోన్మాదులు డిమాండ్ చేసిన కొన్ని రోజుల్లోనే దుర్గా ఆలయాన్ని కూల్చేవారు. మూడు రోజుల్లోనే కూల్చివేత జరిగింది. పోలీసులు, సైనిక సిబ్బంది సహాయంతో బంగ్లాదేశ్ రైల్వే అధికారులు కూల్చివేతను



నిర్వహించారు. ఖిలే?ట్ సర్బోజానిన్ శ్రీ శ్రీ దుర్గా మందిర్ రైల్వే భూమిలో అక్రమంగా నిర్మించబడినందున దానిని కూల్చివేశారని బంగ్లాదేశ్ రైల్వే అధికారులు చెబుతున్నారు.



కేంద్ర పథకం కింద రూ.10 లక్షలు

# దేశంలోనే తొలి చెక్కు అందుకున్న ఏపీ మహిళ

రాజమహేంద్ర వరం: 'మిషన్ వాత్సల్య – పీఎం బాల సంరక్షణ యోజన'కు సంబంధించి దేశంలోనే తొలి చెక్కును తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరుకు చెందిన సుమామణి అందుకున్నారు. కరోనా సమయంలో తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకు ప్రధాని ప్రకటించిన ఈ పథకం ద్వారా రూ. 10 లక్షల్ని ఫిక్స్ డిపాజిట్ చేశారు. సంబంధిత వ్యక్తులకు 23 ఏళ్లు నిండిన తర్వాత సొమ్మును అందిస్తారు.సుమామణి చిన్నప్పుడే తండ్రిని కోల్పోయారు. 19 ఏళ్ల వయసులో కరోనా రెండోదశలో తల్లినీ కోల్పోయారు. అలా పీఎం కేర్ పథకానికి ఎంపికైన ఈమెకు ఇటీవల 23 ఏళ్లు నిండటంతో చెక్కును అందించారు.

కార్యక్రమంలో రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు. పీఎం కేర్ రూ.10 లక్షల చెక్కుతో పాటు దానికి వడ్డీగా వచ్చిన మరో రూ.10 లక్షలు కలిపి మొత్తం రూ. 20 లక్షల రూపాయల చెక్కును అందజేశారు."కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు మిషన్ వాత్సల్య – పీఎం బాల సంరక్షణ యోజన పథకం అండగా నిలుస్తోంది. ఇలా దేశ వ్యాప్తంగా 19 మంది తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు లబ్ధిని ఇవాళ అందుకుంటున్నారు.సుమామణికి అభినందనలు తెలియజేస్తున్నాను." రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి అన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచండి

- సంక్రాంతి దసరా సెలవులకు టూర్ ప్యాకేజీ
- విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట
- ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ
- విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- సిఎస్ఆర్ నిధులతో విద్యార్థుల కోసం 600 డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ
- పాఠశాలలో లైబ్రరీ ప్రారంభోత్సవం
- మహదేవపూర్ లో చిల్డ్రన్ పార్క్ ప్రారంభోత్సవం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణ

భూపాలపల్లి సూర్య ప్రతినిధి/ మహదేవపూర్/ కాటారం, మేజర్ న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచండి సంక్రాంతి దసరా సెలవులకు టూర్ ప్యాకేజీ ఏర్పాటుచేసి హైదరాబాద్ ఢిల్లీ నగరాలకు తీసుకెళ్తామని రాష్ట్రంలో తమ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.శుక్రవారం కాటారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని ప్రారంభించి, సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ప్రాథమిక పాఠశాలలకు సిఎస్ఆర్ నిధుల ద్వారా విద్యార్థుల కోసం 600 డ్యూయల్ డెస్క్ బెంచీలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలకు కావలసిన అవసరాలను మంత్రి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మంత్రి మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తయారు చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా రెండు జతల బట్టలు, పుస్తకాలు, అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలను తలదన్నేలా విద్యార్థులు విద్యను అభ్యసించాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇంగ్లీషులో మాట్లాడాలని చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.జిల్లా, మండల స్థాయి విద్యా శాఖ అధికారులు ప్రతి పాఠశాలను పరిశీలించాలని ఆదేశించారు. పాఠశాలలకు కావలసిన సౌకర్యాలు, అవసరాలు తెలుసుకొని నివేదికలు అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అధునాతనంగా తీర్చి దిద్దడానికి సహకరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది మంత్రి శ్రీధర్ బాబు దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలీం కో సంస్థ ద్వారా అందిస్తున్న దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు, ఇతర ఉపకరణాలు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. మహదేవ్ పూర్ మండలంలో సుమారు 200 మంది దివ్యాంగులను గుర్తించడం జరిగిందని వారిలో మొదటి విడతలో 50 మంది దివ్యాంగులకు వివిధ రకాలైన బ్యాటరీ ట్రై సైకిళ్ళు, సాధారణ ట్రై సైకిళ్ళు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, స్టాండ్ లు వారి వారి వైకల్యాన్ని బట్టి అందిస్తున్నామన్నారు.ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని ఇల్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మహదేవ్ పూర్ మండలానికి చెందిన 89 మంది లబ్దిదారులకు సుమారు 90 లక్షల రూపాయల కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన డా బి.ఆర్ అంబేద్కర్ చిల్డ్రన్ పార్క్ ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్ అయిత ప్రకాష్ రెడ్డి, కూడా చైర్మెన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, సీడీపిఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పరిపాలన ద్వారా మార్పులు తీసుకువస్తాం

- నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు..మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు
- కాళేశ్వరం కేసులో సమగ్ర విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య



తెలంగాణ బ్యూరోప్రతినిధి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. మీడియాతో మాట్లాడుతూ ఆయన బహిరంగంగా వ్యాఖ్యానిస్తూ, గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్ను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. తలతిక్క పనులే బీఆర్ఎస్ను తిరస్కరించేలా చేశాయి అని జూపల్లి వ్యాఖ్యానించారు. ఇలాంటివి ఆదర్శ పాలనకు దూరమైన చర్యలు. ప్రజాస్వామ్యంలో నైతిక విలువలకే అవమానం అని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు సహా ఇతర కీలక అంశాల్లో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, అందుకే కాళేశ్వరం పై విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కమిషన్కు అవసరమైన అన్ని పత్రాలు సమర్పించబోతున్నామని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిపథంలోకి తీసుకురావడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోంది. ఎలాంటి ఎన్నికలు జరిగినా, కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుస్తుందనే నమ్మకం ఉంది" అని జూపల్లి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిపాలన ద్వారా మార్పులు తీసుకువస్తామని, పార్టీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అందరూ కలిసి కాంగ్రెస్ను బలోపేతం చేస్తామన్నారు

# ఢిల్లీకి తక్షణమే అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి



- బిజెపి కాంగ్రెస్ చిత్తశుద్ధి చూపించాలి
- బిజెపి నిర్లక్ష్యం వహిస్తోంది
- బీసీలను బిఆర్ఎస్ మోసం చేసింది
- బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బిల్లు ఆమోదింప చేయాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టీ చిరంజీవులు అన్నారు. లేని పక్షంలోబీసీలం పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

శుక్రవారం మధ్యాహ్నం ప్రెస్ క్లబ్ లో పలు బీసీ సంఘాల నేతలతో కలిసి సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు బీసీల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, బిజెపిలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలో బిల్లు ఆమోదింప చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వము బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్ పాస్ చేసి కేంద్రానికి పంపి ఇప్పటికీ మూడు నెలల సమయం కావస్తున్నా కేంద్రంలో కదలిక లేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి బిల్లు పంపిన అనంతరం ఏడుసార్లు క్యాబినెట్ మీటింగ్ జరిగిందని ఈ బిల్లును మాత్రం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి వేగంగా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని లేని పక్షంలో బీసీలు అంతా కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు .ప్రధాని నరేంద్ర మోడీ అపాయింట్మెంట్స్ ఇవ్వకపోతే ధర్నా చేయాలని సూచించారు. 42 శాతం రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పోరాటం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కేంద్రంలో బిజెపి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తేవడంలో కేవలం ఎనిమిది రోజుల్లోనే చట్టం చేసి దేశవ్యాప్తంగా అమలు చేసిందని అదే బీసీల బిల్లు విషయంపై పూర్తిగా నిర్లక్ష్యగా వ్యవహరిస్తుందని ఆరోపించారు .బీసీ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు బిజెపి కాంగ్రెస్ లు కలిసి కృషి చేయాలని కోరారు. కోర్టు తీర్పులు కూడా బీసీలకు ప్రతికూలంగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల పరిరక్షణ 9వ షెడ్యూల్ లో చేర్చడం ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రిజర్వేషన్ల జీవోలు కోర్టులో నిలబడవని తెలిపారు. భారత రాజ్యాంగంలో రిజర్వేషన్లు మౌలిక సూత్రాలకు అనుకూలమే కాబట్టి 9వ షెడ్యూల్లో పెడితే కోర్టులు సమీక్షించవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో ఇచ్చిన హామీ మేరకు కచ్చితంగా 42% రిజర్వేషన్లు అమలు చేయాలని అందుకు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు చామకూర రాజు, కె వి గౌడ్, డాక్టర్ అవ్వారు వేణు కుమార్, పాలకుర్తి అశోక్, చెన్న శ్రీకాంత్ ఒంటెద్దు నరేందర్, శ్రీనివాస్, దుర్గయ్య గౌడ్, అవ్వారు వేణు, కొండల్ గౌడ్, నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్, బైరు శేఖర్, ఆయిలి వెంకన్న గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్, ఎర్ర మాద వెంకన్న, రాపోలు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వసతులే ప్రామాణికం

- ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం యోచన
- గత విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ నివేదిక పరిశీలన
- పరిగణనలోకి సుప్రీంకోర్టు తీర్పులు
- ఆయా అంశాల అధ్యయనానికి కమిటీ నియామకం....
- నిర్దేశిత సమయంలోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం



తెలంగాణ బ్యూరోప్రతినిధి: రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయంపై హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్లు, భవనాలు.. ఇతర వసతులు... ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలనే భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కృత్రిమ మేధ (ఏఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్లు కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళికబద్ధంగా ముందుకువెళ్లేలా వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్లు.. ఏఐసీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని ఆశిస్తున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్ణాటక, పీఏ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో... ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబ్లు, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది.. ఇతర వ్యవహారాలపై గత ప్రభుత్వం విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదిక రూపొందించింది. కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎటువంటి చర్య తీసుకోలేదు. కానీ తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి.. మరికొన్ని కళాశాలలకు మాత్రం పక్షపాత వైఖరితో మొండి చేయి చూపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నివేదిక పరిశీలనతో పాటు ఇంజినీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.



# అపూర్వమైన వృద్ధిని సాధించిన దక్షిణ మధ్య రైల్వే

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: 2022-23, 2023-24 2024-25 వరుసగా మూడు సంవత్సరాలు జోన్ను నడిపించడంలో కీలక పాత్ర పోషించిన జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ నాయకత్వంలో ఒక అద్భుతమైన యుగం. దక్షిణ మధ్య రైల్వే (ఎస్.సి.ఆర్) 2022%-23, 2023-24, 2024-%25 వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలు అత్యుత్తమ పనితీరును అందించడం ద్వారా వృద్ధి పరివర్తన యొక్క చారిత్రాత్మక దశలోకి ప్రవేశించింది. ఈ అద్భుతమైన ప్రయాణాన్ని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ దూరదృష్టి గల నాయకత్వం చురుకైన నిర్వహణ విధానంతో నడిపించి భారతీయ రైల్వేలలో అత్యంత సమర్థవంతమైన జోన్లలో ఒకటిగా దక్షిణ మధ్య రైల్వేను నిలిపారు. జైన్ ఈ నెలలో జరగనున్న పదవీ విరమణ సంధర్భంగా తన గొప్పతనాన్ని మరియు ప్రేరణను చాటారు. గడచిన మూడు సంవత్సరాలలో దక్షిణ మధ్య రైల్వే ఆదాయం సరుకు రవాణాలో రికార్డు గరిష్టాలను సాధించింది. స్థూల మూలాధార ఆదాయం 2022%-%23 సంవత్సరంలో రూ 18,976 కోట్లకు పెరగగా ఇది 2023%-%24 సంవత్సరంలో రూ 20,339 కోట్లకు 2024%-%25 సంవత్సరంలో రూ 20,569 కోట్లకు గణనీయంగా వృద్ధిచెందింది. తదనుగుణంగా, సరుకు రవాణా లోడింగ్, 2022%-%23 సంవత్సరంలో 131.8 మిలియన్ టన్నులు, 2023%-%24 సంవత్సరంలో 141.1 మిలియన్ టన్నులు మరియు 2024%-%25 సంవత్సరంలో 144.1 మిలియన్ టన్నుల గరిష్ట స్థాయికి చేరుకుని నూతన రికార్డులకు చేరుకుంది. అదే సంవత్సరాల్లో వరుసగా రూ 13,051 కోట్లు, రూ 13,620 కోట్లు, రూ 13,864 కోట్లు సరుకు రవాణా ఆదాయంను నమోదుచేసి గణనీయమైన వృద్ధిని సాధించింది. అదేవిధంగా, ప్రయాణీకుల విభాగం నుండి వచ్చే ఆదాయం ఈ మూడు సంవత్సరాలలో ప్రతి సంవత్సరం రూ 5,000 కోట్ల మార్కును దాటింది. ఈ కాలంలో కొత్త లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ మొదలైన వాటి రూపంలో మొత్తం 960 కిలోమీటర్ల ట్రాక్ను జోడించడం ద్వారా జోన్ నెట్వర్క్ విస్తరణలో గణనీయమైన పురోగతిని సాధించింది. ఇంజనీరింగ్ రంగంలో, దక్షిణ మధ్య రైల్వే దాని అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టులలో కొన్నింటిని అమలు చేసింది. వీటిలో గూడూరు సమీపంలో జోన్ యొక్క పొడవైన 2.2 కిలోమీటర్ల రైలు ఫ్లైఓవర్ నిర్మాణం మరియు కాజీ పేట బైపాస్ ప్రాజెక్టో భాగంగా కాజీపేట సమీపంలో దాని మొట్టమొదటి రైలు-అండర్-రైలు నిర్మాణాన్ని ప్రారంభించడం జరిగింది. మూలధన వ్యయం కూడా మూడు సంవత్సరాలలో మొత్తం ?47,050 కోట్ల రికార్డు స్థాయికి చేరుకుంది. రైల్వే మంత్రిత్వ శాఖ దార్శనికతకు అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ 6,500 కోట్ల అంచనా వ్యయంతో 119 స్టేషన్లను సమగ్ర పునరాభివృద్ధి కోసం గుర్తించింది. ఈ పరివర్తన చొరవలో భాగంగా సికింద్రాబాద్, తిరుపతి, నెల్లూరు, హైదరాబాద్, విజయవాడ, కాచిగూడ, నాందేడ్, ఔరంగాబాద్ జల్నా వంటి ప్రముఖ స్టేషన్లలో పునరాభివృద్ధి పనులు పురోగతిలోఉన్నాయి. బేగంపేట, కరీంనగర్ వరంగల్ వంటి మూడు అమృత్ స్టేషన్లు ఇప్పటికే పునరాభివృద్ధి చేయబడి ప్రారంభించబడ్డాయి. ఈ స్టేషన్లు అత్యాధునిక ప్రయాణీకుల సౌకర్యాలు మరియు మెరుగైన వసతులు అందిస్తున్నాయి. సరుకు రవాణా మరియు మల్టీమోడల్ లాజిస్టిక్స్ సామర్థ్యాలను మరింత మెరుగుపరిచే పదమూడు గతి శక్తి కార్గో టెర్మినల్స్ ప్రారంభించబడ్డాయి. హైదరాబాద్ జంట నగర ప్రాంతంలో టెర్మినల్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తూ, చర్లపల్లిలో రూ 413 కోట్ల వ్యయంతో కొత్త కోచింగ్ టెర్మినల్ను అభివృద్ధి చేశారు. ఈ ఆధునిక టెర్మినల్ ప్రపంచ స్థాయి సౌకర్యాలు మరియు సమకాలీన స్టేషన్ భవనంతో అమర్చబడి, నగరవాసులకు ప్రయాణ సౌలభ్యాన్ని గణనీయంగా అందిస్తోంది. ఇటీవల పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న లైన్లు మినహా, జోన్ యొక్క మొత్తం బ్రాడ్-గేజ్ నెట్వర్క్ యొక్క విద్యుదీకరణ పూర్తయింది. మూడు సంవత్సరాలలో 396 ఎలక్ట్రిక్ లోకోమోటివ్లను ప్రారంభించడంతో జోన్ యొక్క లోకోమోటివ్ సంఖ్యలో గణనీయమైన వృద్ధి సాధించి , మొత్తం 1,268కి పెరిగింది మరియు దక్షిణ మధ్య రైల్వే దేశంలో రెండవ అతిపెద్ద ఎలక్ట్రిక్ లోకోలు గల జోన్గా నిలిచింది.ప్రయాణీకుల సేవలను పెంచే దిశలో భాగంగా ఎనిమిది వందే భారత్ ఎక్స్ప్రెస్ రైళ్లు, 15 కొత్త ఎక్స్ప్రెస్ సర్వీసులు మరియు 28 అదనపు ఎం.ఎం.టి.ఎస్ సర్వీసులను ప్రవేశపెట్టడంలో దక్షిణ మధ్య రైల్వే యొక్క నిబద్ధత ప్రతిబింబిస్తుంది. ఇవి పెరుగుతున్న ప్రయాణీకుల అవసరాలను సమర్థవంతంగా తీరుస్తాయి. భద్రతను మెరుగుపరిచే దిశగా , జోన్ 234 మానవసహిత లెవల్ క్రాసింగ్లను తొలగించి, 32 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు మరియు 204 రోడ్ అండర్ బ్రిడ్జిలను నిర్మించింది. వేగం మరియు సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, 1,835 రూట్ కిలోమీటర్ల మేర చేసే దక్షిణ మధ్య రైల్వే యొక్క కీలక మార్గాల్లో గరిష్టంగా అనుమతించదగిన వేగాన్ని గంటకు 130 కిలోమీటర్లకి పెంచారు. దీనికి అదనంగా, నిరంతర రైలు కార్యకలాపాలను సజావుగా నిర్వహించడానికి మరియు సమయపాలన మెరుగుపరచడానికి 173 శాశ్వత వేగ పరిమితులను తొలగించారు లేదా సడలించారు, తొమ్మిది పొడవైన లూప్ లైన్లు నిర్మించారు మరియు 27 ఇంటర్మీడియట్ బ్లాక్ సిగ్నల్లను ప్రారంభించారు.సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునీకరణ మరొక ప్రధాన అంశం. ఈ రంగంలో 289 రూట్ కిలోమీటర్లను ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ కిందకు తీసుకువచ్చారు మరియు 128 స్టేషన్లలో ఆధునిక ఎలక్ట్రానిక్ ఇంటర్లాకింగ్ను ప్రారంభించారు. జోన్ యొక్క వర్క్షాప్లు రైల్వే బోర్డు లక్ష్యాలను అధిగమించడం ద్వారా అసాధారణ పనితీరును ప్రదర్శించాయి. గత మూడు సంవత్సరాలలో 8,800 కోచ్లు మరియు 20,000 వ్యాగన్ల పి.ఓ.ఎచ్ అవుట్టర్న్ను సాధించాయి. స్క్రాప్ డిస్పోజల్ ద్వారా వచ్చే ఆదాయం2022%-%23లో రూ 391 కోట్లు, 2023%-%24లో రూ 451 కోట్లు 2024%-%25లో రూ 501 కోట్లతో స్థిరమైన పెరుగుదలను నమోదుచేసింది. ఇది జోన్ ప్రారంభం నుండి ఇప్పటివరకు అత్యధికంగా నమోదైంది.దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల భద్రతా రంగంలో, నాన్హే ఫరిష్టే, యాత్రి సురక్ష మరియు ఉపలబ్ధ్ వంటి అనేక విజయవంతమైన ఆపరేషన్లను నిర్వహించి తద్వారా 5,000 మందికి పైగా పిల్లలను రక్షించడం మరియు ప్రయాణీకుల భద్రతను గణనీయంగా మెరుగుపరచడం జరిగింది. దక్షిణ మధ్య రైల్వే తన రోజువారీ కార్యకలాపాలలో ఆవిష్కరణలను చేర్చి , సికింద్రాబాద్లో ఇంటర్నెట్ ఆధారిత స్మార్ట్ పంపింగ్ సిస్టమ్, ప్లాట్ఫారమ్ లైన్ల లోతైన స్క్రీనింగ్, యూనివర్సల్ స్పీడోమీటర్ యాప్, అధునాతన ట్రాక్ మెషిన్ ఆపరేషన్లు మరియు ఆటోమేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్లలో ఎన్.వి.మక్స్ యొక్క ఏకీకరణ వంటి చొరవలను అమలు చేస్తోంది. అదనంగా, రోలింగ్ బ్లాక్ మేనేజ్మెంట్ యాప్, రైల్ కళారంగ్ యాప్, ఎల్. సి గేట్లు/ఆర్.ఓ,బి/ ఆర్. యూ. బి వెబ్ అప్లికేషన్ యాప్, రక్తదాన మొబైల్ యాప్ వంటి అనేక మొబైల్ అప్లికేషన్లు కార్యాచరణ సామర్థ్యాన్ని మరియు వినియోగదారుల సౌలభ్యాన్ని పెంచడానికి అభివృద్ధి చేయబడ్డాయి.స్థిరమైన కార్యకలాపాలు మరియు ఇంధన పరిరక్షణలో జోన్ చేసిన కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ మరియు రాష్ట్ర ఇంధన పరిరక్షణ అవార్డులు, సిఐఐ అవార్డులు, గ్రీన్ కో సర్టిఫికేషన్లు మరియు షున్యాం లేబులింగ్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులు జోన్ కు లభించాయి.

సమగ్రమైన ఉత్తమ పనితీరుకుగాను , 2024లో సివిల్ ఇంజనీరింగ్ మరియు నిర్మాణ విభాగాలతో సహా గత మూడు సంవత్సరాలుగా రైల్వే బోర్డు ద్వారా దక్షిణ మధ్య రైల్వే పనితీరు సామర్థ్య షీల్డ్లతో సత్కరించబడింది.ప్రతి రంగంలోనూ సమయానుకూలంగా శ్రమించి , ప్రతి విషయంలోనూ రాణించిన మా అధికారులు, పర్యవేక్షకులు ఫ్రంట్లైన్ సిబ్బంది చూపిన నిబద్ధతను నేను ఎంతో విలువైనదిగా భావిస్తున్నాను. పూర్తి నిబద్ధత, అధిక సామర్థ్యం మరియు అదనపు పనితీరును ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్న బృందానికి నాయకత్వం వహించడం నా అదృష్టంగా భావిస్తున్నాను." అని తెలిపారు.



# ఏరోస్పేస్ రంగం పెట్టుబడులకు ఆకర్షణ

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: భారతదేశ రక్షణ అండ్ ఏరోస్పేస్ రంగం ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణాకేంద్రంగా ఎలా మారింది. అమేయ్ బెలోర్కర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, ఐడీబీఐ క్యాపిటల్

భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద రక్షణ ఆయుధాల దిగుమతిదారుని స్థానం నుండి, కేవలం దశాబ్దంలోనే వేగంగా ఎదుగుతున్న ఎగుమతిదారుగా మారింది. ఒకప్పుడు రక్షణ అవసరాల్లో 70% దిగుమతులపై అధికంగా ఆధారపడిన భారతదేశం, ప్రస్తుతం 100కు పైగా దేశాలకు పరికరాలను సరఫరా చేస్తూ అంతర్జాతీయంగా తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది. భారత రక్షణ ఎగుమతులు 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ 686 కోట్ల నుంచి 2023-24లో రూ 21,083 కోట్లకు దూసుకెళ్లాయి, ఇది ప్రభుత్వ తీసుకున్న చర్యల వల్ల సాధ్యమైన గణనీయమైన పరిణామం. భారతదేశం ఇప్పుడు కేవలం స్వావలంబన రక్షణ వాతావరణం నిర్మించడమే కాక, ఏరోస్పేస్ తయారీలో ప్రపంచ నాయకత్వం దిశగా అడుగులు వేస్తోంది. స్వావలంబనకు మార్గం %-% దేశీయ తయారీ సామర్థ్యంలో భారత్ పురోగతి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం అనేది భారతదేశ రక్షణ యంత్రాంగం యొక్క స్పష్టమైన వ్యూహాత్మక ఉద్దేశం. 2020లో ప్రారంభించిన ఆత్మనిర్భర్ భారత్, రక్షణ మరియు ఏరోస్పేస్ ప్రధాన ప్రాధాన్యతలు ఉన్న రంగాల్లో భారతదేశాన్ని తయారీ కేంద్రంగా భావిస్తుంది. అంతేకాకుండా, మేక్ ఇన్ ఇండియా భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి తయారీకి ప్రైవేట్ విదేశీ సంస్థలను ఆహ్వానించడం ద్వారా ఈ మిషన్కు మద్దతు ఇస్తుంది.డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్ లో "బై ఇండియన్ " ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దేశీయ సేకరణ విధానానికి బలమైన ఊతం లభించింది. వేగవంతమైన లైసెన్సింగ్ ప్రక్రియ, క్రమబద్ధీకరించిన క్లియరెన్స్ వ్యవస్థ, ప్రైవేట్ రంగంలో చురుకైన భాగస్వామ్యం ప్రోత్సాహం ఇవి అన్నీ కలిపి పెట్టుబడి-స్నేహపూర్వక వాతావరణాన్ని నిర్మించాయి. అంతేకాక, భారతదేశాన్ని పెట్టుబడులకు మరింత ఆకర్షణీయంగా మార్చడంలో పన్ను మినహాయింపులు, ఆర్ అండ్ గ్రాంట్లు, పరీక్షా సౌకర్యాల అభివృద్ధి వంటి ఆర్థిక ప్రోత్సాహకాల పాత్ర కూడా కీలకంగా నిలిచింది. భారత రక్షణ ఉత్పత్తులు వాటి ఎగుమతులు దేశంలో చేసిన సంస్కరణల విజయాన్ని ప్రపంచం గుర్తిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ రంగం 32.5% ఎగుమతి వృద్ధిని నమోదు చేసింది. ఇది కేవలం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన పురోగతిని చూపడమే కాదు, 2013-14తో పోలిస్తే 10 ఏళ్లలో ఎగుమతులు 31 రెట్లు పెరిగిన అవిశ్రాంత ప్రగతిని కూడా సూచిస్తుంది. యూఎస్ఏ, ఫ్రాన్స్, ఆర్మేనియా వంటి దేశాలు భారత రక్షణ ఉత్పత్తుల ప్రధాన కొనుగోలుదారులుగా ఎదగడం, భారతదేశం యొక్క నాణ్యత, స్థోమత మరియు ఆవిష్కరణల పట్ల గ్లోబల్ మార్కెట్లలో పెరుగుతున్న నమ్మకాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన రక్షణ పారిశ్రామిక కారిడార్లు, దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీని మరింత బలోపేతం చేస్తున్నాయి. ఇవి స్వదేశీ తయారీ సామర్థ్యానికి గట్టి ఆధారంగా మారుతున్నాయి. ఉదాహరణకు: బీహార్లో తయారైన సైనిక బూట్లు, ప్రస్తుతం రష్యన్ సైనిక సిబ్బందిచేత ఉపయోగించబడుతున్నాయి. భారతీయ సంస్థలు బ్రహ్మోస్ క్షిపణులు, నౌకాదళ నౌకల కోసం బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, నిఘా వ్యవస్థలు వంటి ముఖ్యమైన పరికరాలను ఎగుమతి చేస్తున్నాయి. తేజస్ ఫైటర్ జెట్, ధ్రువ్ హెలికాప్టర్లు, పినాకా రాకెట్ వ్యవస్థ వంటి స్వదేశీ ప్లాట్ఫారాలు అంతర్జాతీయ ఖాతాదారుల ఆసక్తిని ఆకర్షిస్తున్నాయి. ఈ అనూహ్య పురోగతిని దృష్టిలో ఉంచుకుని, భారత ప్రభుత్వం 2029 నాటికి రూ 50,000 కోట్ల విలువైన రక్షణ ఎగుమతుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రస్తుత వృద్ధి పథాన్ని బట్టి చూస్తే, ఇది సాధ్యమైన, నెరవేర్చదగిన లక్ష్యంగా కనిపిస్తోంది. తదుపరి తరం సాంకేతికతలతో భవిష్యత్తును ఆకృతీకరిస్తున్న భారత్క్వాంటం టెక్నాలజీలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థలు, స్వయంప్రతిపత్తి వాహనాలు వంటి భవిష్యత్-ముఖమైన రంగాల్లో భారత ప్రభుత్వం నిరంతర పెట్టుబడులు పెడుతోంది. ఈ అభివృద్ధిలో ఎమ్మెస్ ఎం ఈ లు స్టార్టప్లు కీలక భాగస్వాములుగా మారుతున్నాయి ు వీటిని సరఫరా గొలుసులో చురుకుగా మోడళ్లకుప్రాధాన్యతనిస్తున్నారు.ఆధారపడటంతో ప్రారంభమైన భారత్ ప్రయాణం, ఇప్పుడు ప్రభావవంతమైన ఆధిపత్య స్థాయిలోకి చేరుతోంది. రక్షణ మరియు ఏరోస్పేస్ ఎగుమతుల రంగంలో, భారత్ చేస్తున్న పురోగతి అసాధారణమైనది.ప్రభుత్వం నిరంతర విధాన మద్దతు, నైపుణ్య అభివృద్ధిపై పదునైన దృష్టి. ప్రపంచ సరఫరా గొలుసుల బలమైన ఏకీకరణ, ఈ అంశాలన్నీ కలిపి, భారతదేశాన్ని భవిష్యత్లో గ్లోబల్ డిఫెన్స్ అండ్ స్పేస్ ఎగుమతిదారుగా నాయకత్వం వహించే మార్గంలో ఉంది. రాబోయే దశాబ్దంలో, భారతదేశం అంతర్జాతీయ రక్షణ-అంతరిక్ష కథనాన్ని నిర్మించడంలో ఒక శక్తివంతమైన పాత్ర పోషించనుంది.

## పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల




తెలంగాణ బ్యూరోప్రతినిధి: తెలంగాణలో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షల ఫలితాలను అధికారులు శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 42,832 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 38,741 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల్లో 24,415మంది (73.35 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు

## భార్య సంపాదించినా భర్త భరణం చెల్లించాల్సిందే బొంబాయి హైకోర్టు



భార్యాభర్తల విడాకుల కేసులో బొంబాయి హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. భర్తతో ఉన్నప్పుడు భార్య ఎలాంటి జీవన ప్రమాణాలను కొనసాగించిందో, విడాకులు తీసుకునే వరకు అలాంటి జీవనాన్ని కొనసాగించే హక్కు ఆమెకు ఉందని తేల్చి చెప్పింది. అందుకే భార్య సంపాదించినా, భర్త కచ్చితంగా 'భరణం' చెల్లించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. భార్య సంపాదిస్తున్నారన్న కారణంతో ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం సరికాదని పేర్కొంది. భార్య తన వైవాహిక జీవితంలో అలవాటుపడిన జీవన శైలిని కొనసాగించేందుకు ఆమెకు పూర్తి హక్కు ఉందని జస్టిస్ మంజుషా దేశ్పాండే ఏకసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది.

# డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని బాధ్యతగా తీసుకుంటా విజయ్ దేవరకొండ



డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని బాధ్యతగా తీసుకుంటానని అన్నారు హీరో విజయ్ దేవరకొండ. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హీరో రామ్ చరణ్ తో పాటు విజయ్ దేవరకొండ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ – నేను నాదైన ప్రపంచంలో బతుకుతుంటా. బయట ఏం జరుగుతుందో పెద్దగా తెలియదు. విశాఖలో నేను షూటింగ్ చేస్తున్నప్పుడు ఒక పోలీస్ అధికారి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బైట్ ఇవ్వమని చెప్పారు. ఆ క్యాంపెయిన్‌లో పాల్గొన్నాను. ఆ తర్వాత డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఇంటర్నేషనల్ డే ఉందని తెలిసి ఆశ్చర్యపోయా. కొందరు పోలీస్ అధికారులను అడిగితే వివరాలు చెప్పారు. ఆ వివరాలు తెలుసు కున్న ఈ వ్యసనం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలి అనిపించింది. అందుకే డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని ఒక బాధ్యతగా తీసుకుంటున్నా. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. అక్కడి యువతకు మత్తు పదార్థాలు అలవాటు చేస్తే చాలు. మన దేశంలో యువశక్తి ఎక్కువ. అందుకే కొన్ని దేశాలు మన యువతకు మత్తుపదార్థాలు అలవాటు చేసే ప్రయత్నాలు చేస్తున్నాయి.

# డ్రగ్స్ ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు ఒక సోల్జర్ లా మారుదాం- రామ్ చరణ్

'డ్రగ్స్ నివారణ పోరాటంలో ఐక్యంగా నిలబడదాం. డ్రగ్స్ ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు ఒక సోల్జర్ లా మారుదాం' అన్నారు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ స్పెషల్ గెస్ట్‌గా హాజరయ్యారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, రామ్ చరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నియంత్రణ దినోత్సవ కార్యక్రమానికి నాతోపాటు ముఖ్య అతిథులుగా విచ్చేసిన యువ మిత్రులు ఫిలిం ఇండస్ట్రీలో ఒక నూతన శకాన్ని ప్రారంభించిన రామ్ చరణ్‌కి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ కూడా మనస్ఫూర్తిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్వాగతం పలుకుతున్నాను. ఈరోజు ఈ వేదికపై ఉన్న మేము ఎవరు కూడా పెద్దపెద్ద బ్యాగ్రౌండ్ నుంచి వచ్చిన వాళ్ళం కాదు. చిరంజీవి గారు ఏ బ్యాగ్రౌండ్ లేకుండా కష్టపడి దేశమే గర్వించదగ్గ మహానటుడుగా మంచి మనిషిగా గుర్తింపు పొందారు. దాదాపు 50 సంవత్సరాల నిరంతర శ్రమ కఠోర దీక్షతో వాళ్లు రాణించగలిగారు. ఎన్ని కష్టాలు వచ్చినా కృంగిపోలేదు మాదకద్రవ్యాలు వైపు చూడలేదు. వ్యసనాల వైపు బానిసలు కాలేదు. ఎన్ని కష్టాలను వచ్చినా ఎదుర్కొనే ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారు. రామ్ చరణ్ నాకు స్కూల్ కి వెళ్ళినప్పుడు నుంచి తెలుసు నా కళ్ళముందే స్కూల్ కి వెళ్లే కుర్రాడు రియల్ స్టార్ లాగా ఫిల్మ్ ఇండస్ట్రీలో రాణించి ఈరోజు ఆస్కార్ అవార్డుని సాధించి దేశానికి ఒక గౌరవం తెచ్చి పెట్టాడు. ఇది మామూలు గౌరవం కాదు. చిరంజీవి గారి పేరు ఉంటే మన ఇళ్లల్లో ఫంక్షన్ కి పిలుస్తాను. కానీ ఆస్కార్ అవార్డు ఇవ్వలేము. కష్టపడ్డాడు కాబట్టి అవార్డు వచ్చింది. దానికి కారణం దీక్ష పట్టుదలతో ఆ రంగంలో రాణించడం. అందుకే మీ అందరికీ చెప్తున్నాను సిని మాలో వాళ్ళు పోషించే పాత్రలు కాదు రియల్ లైఫ్ లో వారిని ఆదర్శంగా తీసుకోండి. డ్రగ్స్ నిర్మూల నకు అందరూ సామాజిక బాధ్యత తీసుకొని సమాజంలో హీరోలుగా నిలబడండి.'అన్నారు.



# సూర్య డైరెక్షన్‌లో 'కిల్లర్'



పదేళ్ల విరామం తర్వాత మళ్లీ దర్శకునిగా రీఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమయ్యారు ఎస్.జె. సూర్య. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా మూవీ 'కిల్లర్'. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య హీరోగా నటిస్తుండటమే కాకుండా.. కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా తానే సమకూరుస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ గోకులం మూవీస్, ఎస్.జె. సూర్య సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి సహ నిర్మాతలు వి.సి. ప్రవీణ్, బైజు గోపాలన్. 'వాలి', 'ఖుషీ', 'న్యూ' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎస్.జె. సూర్య.. ఈ సినిమాకు భారీ తారాగణాన్ని తీసుకొస్తున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఐదు భాషలలో పాన్ ఇండియా వైడ్‌గా విడుదల కానుంది. "కిల్లర్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకునే స్థాయి సినిమా ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం.

# నెత్తుటి మరకలతో గర్జిస్తున్న సివంగిలా రష్మిక



'యానిమల్', 'పుష్ప-2', 'ఛావా' వంటి వరుస పాన్ ఇండియా విజయాలతో ఫుల్ జోష్‌లో ఉంది రష్మిక మందన్న. 'సికందర్' షాక్ ఇచ్చినప్పటికీ.. రీసెంట్‌గా విడుదలైన 'కుబేర'తో మళ్ళీ కమ్ బ్యాక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు ఓ ఫిమేల్ ఓరియెంటెడ్ ఫిల్మ్ ప్రకటించింది. అది కూడా పాన్ ఇండియా మూవీ కావడం విశేషం. అన్ ఫార్ములా ఫిలిమ్స్ బ్యానర్‌లో రష్మిక చేస్తున్న మూవీ ప్రకటన నిన్న వచ్చింది. తాజాగా ఈ చిత్ర టైటిల్ ని, ఫస్ట్ లుక్ ని రివీల్ చేశారు. ఈ సినిమాకి 'మైసా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను పెట్టారు. ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా అంతే పవర్ ఫుల్‌గా ఉంది. చేతిలో ఆయుధం పట్టి, నెత్తుటి మరకలతో గర్జిస్తున్న సివంగిలా రష్మిక కనిపిస్తోంది. అనుష్క తర్వాత ఈ జనరేషన్ లో ఇంతటి పవర్ ఫుల్ ఫిమేల్ ఓరియెంటెడ్ ఫిల్మ్ చేసిన హీరోయిన్స్ తక్కువనే చెప్పాలి. ఆ లోటుని రష్మిక తీర్చేలా ఉంది. ఈ సినిమా హిట్ అయితే రష్మిక స్టార్డం మరోస్థాయికి వెళ్తుంది అనడంలో సందేహం లేదు. 'మైసా' ఫస్ట్ లుక్‌లో నెవర్ బిఫోర్ లుక్‌లో కనిపించి సర్ ప్రైజ్ చేసిన రష్మిక.. సినిమాతో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# రోలర్ కోస్టర్ లవ్ ఎంటర్ టైనర్ గా "లవ్ జాతర"



అంకిత్ కొయ్య, మానస చౌదరి హీరో హీరోయిన్లుగా యూజీ క్రియేషన్స్ బ్యానర్‌లో "సమ్మతమే" ఫేమ్ డైరెక్టర్ గోపీనాథ్ రెడ్డి రూపొందిస్తున్న చిత్రానికి "లవ్ జాతర" టైటిల్ ఖరారు చేశారు. ప్రొడ్యూసర్ కంకణాల ప్రవీణ నిర్మిస్తున్న ఈ చిత్ర టైటిల్ అనౌన్స్ మెంట్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తుంటే టైటిల్ కు తగినట్లే కంప్లీట్ రోలర్ కోస్టర్ లవ్ ఎంటర్ టైనర్‌గా "లవ్ జాతర" సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ అందిస్తుండగా..సుజాత సిద్ధార్థ్ డీవోపీగా వ్యవహరిస్తున్నారు. "లవ్ జాతర"కు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే మేకర్స్ ఇవ్వబోతున్నారు.

# "తమ్ముడు" మూవీకి సెన్సార్ నుంచి 'ఎ' సర్టిఫికెట్

"సంక్రాంతికి వస్తున్నాం" బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ "తమ్ముడు". తాజాగా సెన్సార్ కార్యక్రమాలు ముగించుకున్న ఈ సినిమాకు నిర్మాత దిల్ రాజు 'ఎ' సర్టిఫికెట్ ఎంచుకున్నారు. కట్స్‌తో ఈ సినిమాకు 'యు/ఎ' సర్టిఫికెట్ లభించేది. అయితే ప్రేక్షకులకు బెస్ట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు నిర్మాత దిల్ రాజు 'ఎ' సర్టిఫికెట్ తీసుకున్నారు. ఇటీవల "తమ్ముడు" మూవీ కోసం చేసిన ఇంటర్వ్యూస్‌లో దిల్ రాజు ఏ తరహా సినిమాలు ప్రేక్షకాదరణ పొందు తున్నాయో స్పష్టంగా చెప్పారు. "సంక్రాంతికి వస్తున్నాం" లాంటి కంప్లీట్ ఎంటర్ టైనర్స్ లేదా సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమాలకు మాత్రమే ప్రేక్షకులు థియేటర్స్‌కు వెళ్తున్నారని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే "తమ్ముడు" సినిమాకు ఒక కొత్త తరహా సినిమాటిక్ అనుభవాన్ని ప్రేక్షకులకు అందించేందుకు కట్స్ లేకుండా 'ఎ' సర్టిఫికెట్ తీసుకునేందుకే దిల్ రాజు మొగ్గుచూపారు.



# 'ఓ భామ అయ్యో రామ' లిరికల్ వీడియో



సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రిలక్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం నుంచి తాజాగా 'గల్లి స్టెప్ లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'ఓ మెరుపులా చిందులే వేయారా' అంటూ కొనసాగే ఈ పాటను కథానాయకుడు సుహాస్ ఆలపించడం విశేషం. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటకు సంగీత దర్శకుడు రథన్ స్వరాలు అందించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "సుహాస్ ఆలపించిన ఈ మాస్ సాంగ్ నేటి ట్రెండ్‌కు తగిన విధంగా ఉంటుంది. ప్రతి గల్లిలో తీన్‌మార్ సాంగ్‌లా ఈ సాంగ్ సన్సేషన్ క్రియేట్ చేస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. క్యూట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రత సన్నివేశం ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తుంది. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా ఈ చిత్రం అందరికి కొత్త అనుభూతినిస్తుంది. జూలై 11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం.

# సోషియోఫాంటసీగా "దీర్ఘాయుష్మాన్ భవ"



ఇప్పటివరకు వచ్చిన ప్రేమకథా చిత్రాలకు భిన్నంగా సోషియో ఫాంటసీ ప్రేమకథతో సినిమాగా "దీర్ఘా యుష్మాన్ భవ" చిత్రాన్ని తెరకెక్కించారు. కార్తీక్‌రాజు, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లు. ఎం.పూర్ణానంద్ దర్శకత్వం వహించారు. త్రిపుర క్రియేషన్స్ పతాకంపై వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. సెన్సార్ కార్యక్రమాలను సైతం పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని జులై 11న విడుదల చేయబోతున్నట్లు నిర్మాత వంకాయలపాటి మురళీకృష్ణ తెలిపారు. చక్కటి ఫ్యామిలీ కథాశంతో రెండున్నర గంటల పాటు ప్రేక్షకులను అలరింపజేసే వినోదంతో ఈ చిత్రాన్ని మలచడం జరిగిందని ఆయన చెప్పారు. సోషియో ఫాంటసీ కావడంతో గ్రాఫిక్స్‌కు ప్రాధాన్యం ఇచ్చాం. ఏ పాటకు ఆ పాట ఆహ్లాదభరితంగా ఉంటుందని అన్నారు. యూత్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించామని చెప్పారు. దర్శకుడు ఎం.పూర్ణానంద్ మాట్లాడుతూ, "ఈ చిత్రంలోని పాత్రలలో ఎవరికి వారు పోటీపడి నటించారు. జబర్దస్త్ ఆర్టిస్టుల కామెడీ ఆద్యంతం నవ్వుల పూలు పూయిస్తుంది. హీరో, హీరోయిన్లు తమ పాత్రలలో ఒదిగిపోయారు. సీనియర్ నటి ఆమని నటన ఓ హైలైట్. మొత్తం మీద ఓ మంచి చిత్రాన్ని చూసిన అనుభూతి ప్రేక్షకుడికి కలుగుతుంది.

# 'జూనియర్' కలర్‌ఫుల్ & ఫుల్-ఆన్ ఎంటర్‌టైనింగ్ టీజర్

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి, రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ చిత్ర టీజర్ విడుదలైంది. ఈ టీజర్ సినిమా టోన్, హిలేరియస్, ఫుల్-ఆన్ ఎంటర్‌టైనింగ్ స్నాప్‌షాట్‌ను అందిస్తుంది. కిరీటి ఒక రిలాక్స్



కాలేజీ కుర్రాడు, మార్క్స్ కంటే హ్యాపినెస్ ని ఇష్టపడతాడు, తన చుట్టూ ఉన్న వారిని ఆకర్షించే వ్యక్తిత్వం వున్న తను శ్రీలీలాను ఇష్టపడతాడు, మొదట గొడవతో మొదలైన జర్నీ మెల్లగా ఎట్రాక్టివ్ కెమిస్ట్రీగా మారుతుంది. టీజర్‌లో కిరీటి అదరగొట్టాడు. తన డ్యాన్స్ మూవ్స్, స్టంట్స్, స్పాట్-ఆన్ కామిక్ టైమింగ్ అద్భుతంగా వున్నాయి. టీజర్‌లో కిరీటి చెప్పిన డైలాగులు అదిరిపోయాయి.

# మృణాల్ జాక్‌పాట్



సీతారామం, హాయ్ నాన్న హిట్లతో టాలీవుడ్‌లో సూపర్ క్రేజ్ ఏర్పరచుకున్న మృణాల్ ఠాకూర్ 3వ సినిమా ది ఫ్యామిలీ స్టార్ ఫ్లాప్ అవ్వడంతో ఛాన్స్‌లు రాలేదు. ఎలాగో అడివి శేష్ నటిస్తున్న డెకాయిట్ లో శృతి హాసన్ ఎగ్జిట్ అవ్వగా ఆ అవకాశాన్ని అందుకుంది మృణాల్ ఠాకూర్. ఏ హీరోయిన్‌కి అయినా ఫ్లాపులు వస్తున్నాయి కాబట్టి అవకాశాలు రావు కానీ తెలుగులో 3 సినిమాలు చేస్తే రెండు సూపర్ హిట్లు కొట్టినా కూడా మృణాల్ కి మళ్లీ అవకాశాలు రావట్లేదు. దీని వెనుక రీజన్స్ ఏమై ఉండొచ్చన్న విధంగా ఆమె ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. మృణాల్ ఠాకూర్‌కి కచ్చితంగా మరో మంచి జాక్ పాట్ సినిమా కావాల్సిందే. అప్పుడు కానీ అమ్మడి టాలెంట్ ఏంటన్నది అర్థం కాదని అంటున్నారు. విజయ్ దేవరకొండతో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా మృణాల్ ఠాకూర్ పాత్ర వరకు ఆకట్టుకుంది. తన పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేసింది మృణాల్ థాకూర్. సో ఆమెను నమ్మి అవకాశాలు ఇచ్చినా తప్పులేదు. ఎటొచ్చి కథల ఎంపికలోనే మృణాల్ కాస్త తడబాటు పడుతుందని అర్థమవుతుంది. తెలుగులో డెకాయిట్ తప్ప మరో సినిమా లేదు. ఆ సినిమా హిట్ పడితేనే మరో ఛాన్స్ వచ్చే పరిస్థితి ఏర్పడింది. డెకాయిట్ తర్వాత తెలుగులో సినిమాలేవైనా డిస్కషన్‌లో ఉన్నాయా అంటే లేదన్నట్టుగానే వార్తలు వినిపిస్తున్నాయి. సో మృణాల్‌కి తెలుగులో ఆఫర్లు రావాలంటే ఇంకా అమ్మడు తన ప్రభావం చూపించాల్సి ఉంటుంది. ఇక అమ్మడు బాలీవుడ్‌లో మాత్రం తన మార్క్ సినిమాలు చేస్తూ వెళ్తుంది. అక్కడ స్టార్ క్రేజ్ కోసం తెగ ప్రయత్నాలు చేస్తున్న మృణాల్ సినిమాలైతే గ్యాప్ లేకుండా చేస్తుంది. టాలీవుడ్ లో మాత్రం మృణాల్‌కి ఒక మంచి ఇమేజ్ ఏర్పడింది. అందుకే అమ్మడు ఇక్కడ సినిమాలు చేయాలని ఆసక్తి చూపిస్తుంది.

# "ఉప్పు కప్పురంబు" మ్యూజిక్ ఆల్బమ్

భారతదేశంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన ప్రైమ్ వీడియో, తాజా తెలుగు ఒరిజినల్ సినిమా "ఉప్పు కప్పురంబు" ఈ సినిమాలో మ్యూజిక్ ఆల్బమ్‌ను ఈరోజు విడుదల చేసింది. బిలీవ్ ఇండియా లేబుల్ ద్వారా విడుదలైన ఈ ఆల్బమ్‌లో మూడు ప్రత్యేకమైన పాటలు ఉన్నాయి. ఈ పాటలు చిత్రంలో చూపించే చిన్న పట్టణ జీవితం, హాస్యం, భావోద్వే గాలు అన్నింటినీ మనస్సుకు హత్తుకునేలా పాడబడ్డాయి. సంగీతాన్ని స్వీకార్ అగస్తి అందించగా, పాటల రాతలు రవికృష్ణ విస్సాప్రగడ, ఎస్. అత్తావుర్ రహీం మరియు రఘురాం ద్రోణా వజ్జల చేశారు. ఈ పాటలు పాడిన సీన్ రోల్డన్, అను రాగ్ కులకర్ణి ఆంటోని దాసన్, వీళ్ళ గానంతో పాటలు ఇంకా హృద్యంగా మారాయి. ఒకవైపు నోమి లాలా అనే పాట ఉత్సవాన్ని పాడుతుంటే, మరోవైపు యాడున్నావో అనే పాట ఒక తల్లి బిడ్డ మధ్య దూరాన్ని హృదయాన్ని తాకేలా చూపుతుంది.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044